తెలుగు దినపత్రిక
https://aksharagalam.com
# అక్షరగళం
నిజం.. నిర్భయంగా
హైదరాబాద్ | బుధవారం 18-02-2026 పేజీలు 8 /aksharagalam.com సంపుటి : 13 సంచిక : 2 వెల : 3/-

## రేపట్నుంచి రంజాన్ దీక్షలు



**హైదరాబాద్:** సౌదీ అరేబియాతో పాటు ఇతర దేశాల్లో మంగళవారం నెలవంక కనిపించడంతో రంజాన్ నెల ప్రారంభమైనట్టు అక్కడి ప్రభుత్వం ప్రకటించింది. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 19 (గురువారం) నుంచి ముస్లింలు ఉపవాస దీక్షలు పాటిస్తారని ఇప్పటికే ప్రకటించారు. బుధవారం నెలవంక నిర్ధారణ కమిటీ నెలవంక కనిపించినట్లు ప్రకటించిన అనంతరం రాష్ట్రవ్యాప్తంగా రంజాన్ నెల అధికారికంగా ప్రారంభమవుతుంది. ఇప్పటికే రాష్ట్ర కమిటీతో పాటు ఢిల్లీలోని కేంద్ర కమిటీతో నెలవంక నిర్ధారణ కమిటీ చర్చలు జరిపి రంజాన్ నెల ప్రారంభంపై ప్రకటన చేయనుంది.

# రూ.1,700 కోట్ల పెట్టుబడులు

- గ్లోబల్ మ్యానుఫాక్చరింగ్ కేంద్రంగా హైదరాబాద్
- నాణ్యమైన విద్యాసంస్థలకు నెలువుగా నగరం
- జీవవిజ్ఞాన రంగంలో రూ.73,000 కోట్లకు పైగా పెట్టుబడులు
- రెండేళ్లుగా స్పష్టమైన విజన్‌తో ముందుకు వెళుతున్నాం
- బయో ఏషియా సదస్సు ప్రారంభంలో సిఎం రేవంత్
- లైఫ్ సైన్సెస్ రంగాల్లో పెట్టుబడులకు ప్రోత్సాహం
- ఇప్పటికే హైదరాబాద్‌లో ఎన్నో లైఫ్ సైన్సెస్ కంపెనీలు
- బయో ఏషియా సదస్సులో విదేశీ ప్రతినిధులతో సిఎం చర్చలు
- 19న ఢిల్లీకి సిఎం రేవంత్ బృందం
- కాంగ్రెస్ అగ్రనేతలతో భేటీకి పిలుపు
- కేబినేట్‌లో మార్పులు, చేర్పులుపై ఊహాగానాలు

2







# తెలంగాణ భవన్‌లో కెసిఆర్ జన్మదిన వేడుకలు

- 72 కిలోల కేక్ కట్ చేసిన పార్టీ నేతలు
- తెలంగాణ ఉద్యమ నేపథ్య పాటలు, డాక్యుమెంటరీ విడుదల
- కెసిఆర్ మళ్లీ సిఎం అవుతారన్న మాజీమంత్రి తలసాని
- ముమ్మాటికీ కెసిఆర్ మాత్రమే తెలంగాణ జాతిపిత అన్న కెటిఆర్

2

*బిఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలు మంగళవారం తెలంగాణ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. మాజీమంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ , యువ నాయకులు తలసాని సాయి కిరణ్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు అతిథులుగా హాజరయ్యారు.*

## రోడ్లు శుభ్రం లేకపోతే అధికారులపై చర్యలు

- క్షేత్రస్థాయిలో అధికారులు పర్యటించాలి
- ఫీల్డ్‌కు వెళ్లని అధికారులను తొలగిస్తాం
- నెక్లెస్ రోడ్డులో మల్టీలెవల్ కారు పార్కింగ్
- కొత్త మేయర్లు, మున్సిపల్ ఛైర్మన్లకు ఒకరోజు శిక్షణ
- మున్సిపల్ శాఖపై సమీక్షలో సిఎం రేవంత్ వెల్లడి

2

## సంత్ సేవాలాల్ విగ్రహం ఏర్పాటుకు నిర్ణయం

- పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందేలా ఏర్పాటు
- నల్లమల మద్దిమడుగు ప్రాంతంలో స్థల అన్వేషణ
- ఎంపి, ఎమ్మెల్యేతో కలిసి అధికారుల పరిశీలన

2

## ప్రత్యూష మృతి కేసులో.. సిద్దార్ధరెడ్డికి రెండేళ్ల జైలు

- హైకోర్టు ఆదేశాలను సమర్థిస్తూ సుప్రీంకోర్టు తీర్పు
- నాలుగు వారాల్లో లొంగిపోవాలని ఆదేశం
- హత్య, అత్యాచారం అనుమానాలను తోసిపుచ్చిన సర్వోన్నత న్యాయస్థానం
- 2002 ఫిబ్రవరిలో జరిగిన ఘటన కేసు ఎట్టకేలకు కొలిక్కి



*రెండు దశాబ్దాల క్రితం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సంచలనం సృష్టించిన సినీ నటి ప్రత్యూష మృతి కేసులో నిందితుడు గుడిపల్లి సిద్ధార్థరెడ్డికి తెలంగాణ హైకోర్టు విధించిన రెండేళ్ల జైలు శిక్షను సుప్రీంకోర్టు ఖరారు చేసింది. ఆ తీర్పును సవాల్ చేస్తూ సిద్ధార్థరెడ్డి దాఖలు చేసిన అప్పీల్‌ను కొట్టేసింది. మిగిలిన కాలానికి జైలుశిక్ష అనుభవించడానికి వీలుగా నాలుగు వారాల్లోపు లొంగిపోవాలని ఆదేశించింది.*

**ఢిల్లీ:** మంగళవారం జస్టిస్ రాజేష్‌బిందల్, జస్టిస్ మన్మోహన్‌లతో కూడిన ధర్మాసనం 60 పేజీల తీర్పు వెలువరించింది. 2002 ఫిబ్రవరిలో జరిగిన ఈ సంఘటనపై ట్రయల్ నిర్వహించిన హైదరాబాద్ మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ఇందులో నిందితుడు సిద్ధార్థరెడ్డికి ఐపీసీ 306 (ఆత్మహత్యకు పురికొల్పడం), 309 (ఆత్మహత్యకు ప్రయత్నించడం) సెక్షన్ల కింద ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ 2004 ఫిబ్రవరి 23న తీర్పు చెప్పారు. దాన్ని సవాల్ చేస్తూ సిద్ధార్థరెడ్డి హైకోర్టును ఆశ్రయించగా... జైలుశిక్షను రెండేళ్లకు మిగతా 2లో



## తెలంగాణ గ్రామీణ క్రీడా రంగానికి సాంకేతిక హంగులు

- మట్టిలో మాణిక్యాలను వెలికి తీసేందుకు సీఎం కప్
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

**హైదరాబాద్:** తెలంగాణ గ్రామీణ క్రీడా రంగానికి ప్రోత్సాహం ఇచ్చే లక్ష్యంతో నిర్వహిస్తున్న రెండో విడత సీఎం కప్ 2025 -26 కు సాంకేతిక హంగులు సమకూర్చి క్రీడాకారులకు ఇష్టమైన సమాచార వ్యవస్థ ఏర్పాటు చేయడం సంతోషకరమని తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. మంగళవారం ఆయన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సెక్రటేరియట్లో తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెండో విడత సిఎం కప్ ఆప్‌ను రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి ఎండి డాక్టర్ సోని బాలాదేవి లతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామీణ క్రీడా రంగానికి మిగతా 2లో

## ఢిల్లీకి రండి..

- కాంగ్రెస్ ముఖ్య నేతలకు ఏఐసీసీ ఆహ్వానం
- రేపు రావాలంటూ సీఎం, ముఖ్య నేతలకు ఏఐసీసీ ఆహ్వానం
- అధికారంలోకి వచ్చిన రెండేళ్ల తర్వాత కీలక పిలుపు
- పార్టీ బలోపేతం, బీజేపీ వ్యతిరేక ఆందోళనలపై దిశానిర్దేశం చేసేందుకే..
- రాష్ట్రంలో ఏం జరుగుతోందన్న దానిపైనా చర్చించనున్న హైకమాండ్
- నివేదికలు సిద్ధం చేస్తున్న సీఎం రేవంత్, పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్

**హైదరాబాద్:** రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన రెండేళ్ల తర్వాత ఏఐసీసీ నుంచి తెలంగాణ కాంగ్రెస్ నాయకత్వానికి కీలకమైన పిలుపు వచ్చింది. రాష్ట్రంలోని రాజకీయ పరిస్థితులు, ప్రభుత్వ పనితీరు, పార్టీ బలోపేతం తదితర అంశాలపై చర్చించేందుకు ఈనెల 19న ఢిల్లీకి రావాలంటూ కబురు అందింది. గురువారం ఉదయం 10 గంటలకు ఏఐసీసీ కార్యాలయమైన ఇందిరాభవన్‌లో సమావేశానికి రావాలని సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, కేబినెట్ మంత్రులకు మిగతా 2లో



## ఇంద్రేశం మున్సిపాలిటీ బీఆర్‌ఎస్‌దే

- సంగారెడ్డి జిల్లాలో ఐదు మున్సిపాలిటీలు బీఆర్ఎస్ కైవసం
- జహీరాబాద్‌లో ఎన్నిక రద్దుకు బీఆర్ఎస్ డిమాండ్

*సంగారెడ్డి జిల్లాలోని ఐదు మున్సిపల్ చైర్మన్ పీఠాలను బీఆర్ఎస్ దక్కించుకున్నది. పటాన్‌చెరు నియోజకవర్గం లోని ఇంద్రేశం మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలు మంగళవారం జరిగాయి. ఇంద్రేశంలో మెజారిటీ ఉండటంతో చైర్మన్, వైస్ చైర్మన్ పదవులను బీఆర్ఎస్ కైవసం చేసుకుంది.*

**సంగారెడ్డి:** ప్రమీల చైర్‌పర్సన్‌గా, హరీశ్వర్‌రెడ్డి వైస్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. సోమవారం జరిగిన చైర్మన్ ఎన్నికల్లో ఇస్నాపూర్, జిన్నారం, గుమ్మడిదల, గడ్డపోతారం మున్సిపాలిటీలు బీఆర్ఎస్ కైవసం చేసుకున్నది. తాజాగా ఇంద్రేశం మున్సిపాలిటీని దక్కించు కుని పటాన్‌చెరు నియోజకవర్గంలోని ఐదు మున్సిపాలిటీల్లో బీఆర్ ఎస్ జెండా ఎగురవేసింది. జహీరాబాద్ మిగతా 2లో

## క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్లు

- మార్చి చివరి నాటికి లబ్దిదారుల ఎంపిక
- అసంపూర్తి డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం
- యుద్ధప్రాతిపదికన లబ్దిదారుల ఎంపిక
- ఆర్.ఆర్, ఆర్, ఓ ఆర్ ఆర్ మధ్య అఫర్డబుల్ హౌసింగ్ పాలసీ
- నెలాఖరులోగా ఇండ్ల స్థలాలు కలిగిన 28వేల మందికి ఇందిరమ్మ ఇండ్లు
- హౌసింగ్ పాలసీపై అధికారులతో మంత్రుల సమీక్ష

2



# రూ.1,700 కోట్ల పెట్టుబడులు

**హైదరాబాద్:** హైదరాబాద్ అంటే చార్మినార్.. బిర్యానీ.. ఫార్మా.. సాఫ్ట్‌వేర్ అని గుర్తు.. కానీ ఇవాళ గ్లోబల్ మాన్యుఫాక్చర్‌కి కేంద్రంగా మారిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. నాణ్యమైన విద్యాసంస్థలు.. ఇక్కడ ఉన్నాయి.. హైదరాబాద్ క్యాపబుల్ సెంటర్‌గా మారిందన్నారు. హైటెక్స్‌లో బయో ఏషియా 2026 సదస్సును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. ముందస్తు విజన్, పాలసీతో ముందుకు వెళుతున్నామని అన్నారు. గత రెండు సంవత్సరా ల్లోనే, జీవవిజ్ఞాన రంగంలో రూ.73,000 కోట్లకు పైగా పెట్టుబడులు వచ్చాయన్నారు. కొద్ది వారాల క్రితం దావోస్‌లో మా కొత్త లైఫ్ సైన్సెస్ పాలసీని ప్రకటించాం.. జీనోమ్ వ్యాలీని విస్తరించాం.. ప్రపంచ స్థాయి పరిశోధన, ఆవిష్కరణలకు 'వన్-బయో'ను ప్రారంభించాం.. గ్రీన్ ఫార్మా సిటీని వేగవంతం చేసాం? అనేక గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లను ఆహ్వానించామని తెలిపారు. ఇది సాధారణ అభివృద్ధి కాదు.. ఇది దృఢమైన దృష్టి ఫలితమని వెల్లడించారు. దానికి ప్రత్యక్ష సాక్ష్యం బయోఏషియా 2026 అని సీఎం తెలిపారు. ఈ సభను చూస్తుంటే నేను గర్వంగా చెప్పగలను.. బయోఏషియా తన పేరును దాటి, బయో-వరల్డ్‌గా మారుతోందని సీఎం రేవంత్ తెలిపారు. ఈ రోజు ప్రపంచవ్యాప్తంగా ఉన్న 500 ప్రముఖ సంస్థలకు చెందిన 4,000 మందికి పైగా ప్రతినిధులు ఇక్కడ హాజరయ్యారు.. ఫార్మా, బయోసైన్సెస్, బయోటెక్, బల్క్ డ్రగ్స్, వ్యాక్సిన్లు, ఆరోగ్య రంగాల్లో ప్రముఖులు, బిజినెస్ లీడర్స్ మనతో ఉన్నారని తెలిపారు. సైన్స్, ఎఐ బయోటెక్ వంటి రంగాల్లో ప్రముఖులను కలిసినప్పుడు అసాధారణమైన ఫలితాలు వస్తాయన్నారు. హైదరాబాద్‌లో జరుగుతున్న బయోఏషియా సదస్సు దావోస్‌లో జరిగే వరల్డ్ ఎకనామిక్ ఫోరం లాంటి అంతర్జాతీయ గుర్తింపు పొందుతుందన్న నమ్మకం నాకు ఉందని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. తెలంగాణతో పాటు ముఖ్యంగా జీవవిజ్ఞాన రంగంపై మా దృష్టిని మీతో పంచుకుంటాను. 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగడం మా లక్ష్యమన్నారు. ప్రస్తుత జీవ విజ్ఞాన ధోరణులను చూస్తే పరిశోధన సంస్థలు, కార్పొరేట్లు, స్టార్టప్‌లు, చిన్న మధ్య తరహా సంస్థలు, ప్రభుత్వం మధ్య బలమైన భాగస్వామ్యం అవసరమని తెలిపారు. మీరు విశ్వసనీయమైన, స్థిరమైన, భవిష్యత్తు కోసం మంచి వాతావరణాన్ని కోరుకుంటున్నారు. తెలంగాణ అలాంటి వాతవరణాన్ని కల్పిస్తుంది. దీనికి సమాధానం హైదరాబాదేనని అన్నారు. బల్క్ డ్రగ్స్ నుండి బయాలజిక్స్ వరకు, తయారీ నుండి ఆవిష్కరణ వరకు, భారతదేశం నుండి ప్రపంచ స్థాయి వరకు తెలంగాణ ముందుకు సాగుతోందన్నారు. మేము కేవలం భారతదేశంలోనే పోటీ పడటం లేదు, ప్రపంచంలోని అగ్రగామి క్లస్టర్లతో పోటీ పడుతున్నామని తెలిపారు. హైదరాబాద్ ఇప్పటికే గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లకు ప్రాధాన్య గమ్యస్థానంగా మారిందన్నారు.

**లైఫ్ సైన్సెస్ రంగాల్లో పెట్టుబడులకు ప్రోత్సాహం**

హైదరాబాద్‌లో లైఫ్ సైన్సెస్ రంగాల్లో పెట్టుబడులు, కంపెనీలు పెట్టాలని యోచించే గ్లోబల్ ఇన్వెస్టర్లకు అవసరమైన అన్ని రకాల సహాయాన్ని అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. హైదరాబాద్ మహానగరంలో ఇప్పటికే ఎన్నో లైఫ్ సైన్సెస్ కంపెనీలు హైదరాబాద్‌లో జీసీసీ(గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్)లను ఏర్పాటు చేశాయని గుర్తు చేశారు. ఇదే విషయమై మరింత లోతుగా దృష్టి సారించడానికి, గ్లోబల్ లైఫ్ సైన్సెస్ కంపెనీలకు ఇన్నోవేషన్ సెంటర్‌లను సులభతరం చేయడంపై ప్రత్యేక దృష్టి సారించాలని ముఖ్యమంత్రి సూచించారు. ఫ్యూచర్ సిటీలో జిసిసిల కోసం ఒక ప్రత్యేక జోన్‌ను నిర్మించాలని సీఎం రేవంత్ రెడ్డి ప్రతిపాదించారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన బయో ఏషియా సదస్సు-2026 జరుగుతున్న సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పరిశ్రమలు, ఐటీ శాఖల మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, స్పెషల్ చీఫ్ సెక్రటరీ సంజయ్ కుమార్... లైఫ్ సైన్సెస్ రంగంలో గ్లోబల్ కంపెనీల ప్రతినిధులు, ఎగ్జిగ్యూటివ్‌లతో భేటీ అయ్యారు. ఫ్రాన్స్ లో తన ప్రపంచ ప్రధాన కార్యాలయంతో సనోఫీ నుండి విడిపోయిన గ్లోబల్ కన్స్యూమర్ హెల్త్‌కేర్ కంపెనీ అయిన ఒపెల్లా హెల్త్‌కేర్, దాని జిసిసి కార్యకలాపాలను 42,000 చదరపు అడుగుల సౌకర్యంతో విస్తరిస్తోంది.

**19న ఢిల్లీకి సింఎం రేవంత్ బృందం**

తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటుచేసుకోబోతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ బృందం ఈ నెల 19న ఢిల్లీకి వెళ్లనుంది. రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మారుతున్న రాజకీయ సమీకరణలు, పార్టీ బలోపేతం , భవిష్యత్తు కార్యాచరణపై చర్చించేందుకు ఏఐసీసీ అగ్ర నాయకత్వం ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర మంత్రివర్గంలోని పలువురు కీలక మంత్రులు ఈ పర్యటనలో పాల్గొనబోతున్నారు. వీరితో పాటు రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ కూడా ఈ సమావేశంలో భాగస్వామి కానున్నారు. 19వ తేదీ ఉదయం ఢిల్లీకి చేరుకోనున్న వీరు, కాంగ్రెస్ అగ్ర నేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ , కేసీ వేణుగోపాల్‌తో ప్రత్యేకంగా భేటీ కానున్నారు. రాష్ట్రంలో పాలన మొదలై రెండేళ్లు దాటిన క్రమంలో, క్షేత్రస్థాయిలో పార్టీ పరిస్థితిపై నివేదిక ఇవ్వనున్నారు.

## రోడ్లు శుభ్రం లేకపోతే అధికారులపై చర్యలు

**హైదరాబాద్:** రోడ్లు శుభ్రంగా లేకపోతే అక్కడికక్కడే అధికారులపై చర్యలు తీసుకుంటానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించారు. కమిషనర్లు, జోనల్ కమిషనర్లు ఉదయం నుంచే ఫీల్డ్‌లో ఉండాలని, రోజూ సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. పురపాలక శాఖపై మంగళవారం కీలక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ అధికారులు, కమిషనర్లు, సిబ్బందిపై సీఎం సీరియస్ అయ్యారు. త్వరలోనే ప్రతి జోన్‌లో వ్యక్తిగతంగా పర్యటించి పరిస్థితులను పరిశీలిస్తానని స్పష్టం చేశారు. చాలా మంది అధికారులు ఫీల్డ్‌లోకి వెళ్లడం లేదని, అలాంటి వారిని సస్పెండ్ చేస్తానని ముఖ్యమంత్రి వార్నింగ్ ఇచ్చారు. హైదరాబాద్‌తో పాటు మూడు కార్పొరేషన్లలో శానిటేషన్, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. నూతనంగా ఎన్నికైన మేయర్లు, డిప్యూటీ మేయర్లు, మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించాలని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. నగరంలో స్మార్ట్ పోల్స్ ఏర్పాటు పైన అధ్యయనం చేయాలన్నారు. ట్రాఫిక్ బాగా ఉన్న చోట పీపీపీ విధానంలో స్కై వాక్ బ్రిడ్జిల ఏర్పాటుపై అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. నెక్లెస్ రోడ్ రైల్వే స్టేషన్ సమీపంలో మల్టీలెవల్ కార్ పార్కింగ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అడ్వటైజింగ్ బోర్డుల ఏర్పాటుపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వానికి వచ్చే ఆదాయానికి గండి పడకుండా చర్యలు ఉండాలని సీఎం తెలిపారు. ప్రభుత్వ కార్యక్రమాల కోసం 10 శాతం అడ్వటైజింగ్ బోర్డులు కేటాయించాలని ముఖ్యమంత్రి చెప్పారు. అడ్వటైజింగ్ బోర్డుల నుంచి సంవత్సరానికి ఒకసారి ఫీజు వసూలు చేయాలని అధికారులకు సూచించారు. అనధికార అడ్వటైజింగ్ బోర్డులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నగరంలో వీధి దీపాల నిర్వహణలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

## సంత్ సేవాలాల్ విగ్రహం ఏర్పాటుకు నిర్ణయం

**హైదరాబాద్:** రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం రాష్ట్ర ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి కే .యస్ శ్రీనివాస్ రాజ్, ఎంపి బలరాం నాయక్, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదవత్ సంతోష్, అచ్చంపేట ఎమ్మెల్యే డా. వంశీకృష్ణ, ఇతర గిరిజన నాయకులు మరియు అధికారులు కలిసి నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గంలోని పదర మండలం మద్దిమడుగు గ్రామంలో సంత్ సేవాలాల్ మహారాజ్ విగ్రహ స్థాపనకు ప్రతిపాదించిన 20 ఎకరాల స్థలాన్ని వారితో కలిసి పరిశీలించారు. సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ముఖ్య కార్యదర్శి శ్రీనివాస్ రాజ్ మాట్లాడుతూ..., గిరిజనుల ఆరాధ్య దైవమైన సంత్ సేవాలాల్ మహారాజ్ విగ్రహాన్ని దేశంలోనే అతిపెద్దదిగా నిర్మించాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముందుకు సాగుతున్నారని తెలిపారు. క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించి, స్థానిక అవసరాలను దృష్టిలో ఉంచుకుని సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించినట్లు పేర్కొన్నారు. లంబాడీల సంస్కృతి, సాంప్రదాయాలను ప్రతిబింబించే విధంగా విగ్రహ నిర్మాణానికి సంబంధించి పది నెలల్లో పక్కా ప్రణాళికలు రూపొందించి, త్వరలో అధికారిక ప్రకటన చేయనున్నట్లు తెలిపారు.

## తెలంగాణ భవన్‌లో కెసిఆర్ జన్మదిన వేడుకలు

**హైదరాబాద్:** కేసీఆర్ 72 వ జన్మదినాన్ని పురస్కరించుకుని 72 కిలోల భారీ కేక్‌ను కట్ చేశారు. అనంతరం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలు, తెలంగాణ ఉద్యమం నేపథ్యంతో రూపొందించిన పాటలు, డాక్యుమెంటరీని ప్రదర్శించారు. ఈ సందర్భంగా మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ తన ప్రాణాలను పణంగా పెట్టి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన గొప్ప వ్యక్తి గా కేసీఆర్‌చరిత్రలో నిలిచిపోతారని అన్నారు. పదేళ్ల పాలనలో దేశం అబ్బురపడే విధంగా అనేక పథకాలు అమలు చేసిన ఘనత కేసీఆర్ దక్కుతుందని పేర్కొన్నారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని, అధికారంలో ఉన్నామని దౌర్జన్యాలు చేస్తామంటే ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. గ్రామ పంచాయతీ, మున్సిపల్ ఎన్నికలకు గతంలో ఏ ముఖ్యమంత్రి ప్రచారం చేయలేదని, కానీ ప్రస్తుత ముఖ్యమంత్రి ప్రచారం నిర్వహించిన, దౌర్జన్యాలు, బెదిరింపులకు పాల్పడిన చెప్పుకోదగ్గ ఫలితాలు కాంగ్రెస్ పార్టీ సాధించలేదని విమర్శించారు. మూడేళ్ళ తర్వాత వచ్చేది తమ ప్రభుత్వమేనని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు జగదీష్ రెడ్డి, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, సుధీర్ రెడ్డి, తెలంగాణ భవన్ ఇంచార్జి రావుల చంద్రశేఖర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ఉద్యమ కారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఏ జాతి నీది? ఏ జాతికి జాతిపిత అని అడిగిన సన్నాసికి ఇవన్నీ చెప్తా ఉన్నా. తెలంగాణలో రెండే జాతులు ఉన్నాయి. ఒకటి తెలంగాణ వాదుల జాతి, రెండవది తెలంగాణ ద్రోహుల జాతి. మాది ఫైటర్ల జాతి, మీది ట్రెయిటర్ల (ద్రోహుల) జాతి. మాది కేసీఆర్ లాంటి ఫైటర్ల జాతి, నీది మరి ట్రెయిటర్ల జాతి'గుర్తుపెట్టుకో.. కేసీఆర్ ఎన్నడూ చెప్పుకోలేదు నేను జాతిపితనని. ప్రజలు పిలుచుకున్నారు. ఎవరైతే స్వాతంత్య్రం తెచ్చిండో తమ జాతికి, ఆయనను జాతిపితగా ప్రజలు పిలుచుకుంటున్నారని కేటీఆర్ స్పష్టం చేశారు. పెద్దమనిషి, మా తెలంగాణకు బాపు లాంటి పెద్దమనిషి కాబట్టే ఇవాళ మేము గర్వంగా చెప్తున్నాం సర్వసాధారణంగా ఏ తండ్రి అయినా ఆ కొడుకుకు, ఆ పిల్లలకు హీరోగా ఉంటారు. కానీ నా తండ్రి ఇవాళ తెలంగాణకు హీరో, అది తెలంగాణ జాతికి మొత్తానికి హీరో. ఇది వాస్తవం. కొంతమంది మాట్లాడుతున్నారు ఆనవాళ్లు చెరిపేస్తామని. కేసీఆర్ జన్మదిన సందర్భంగా నేను చెప్తా ఉన్నా తెలంగాణనే కేసీఆర్ ఆనవాళ్లు కదా..! తెలంగాణ రాష్ట్రమే కేసీఆర్ ఆనవాళ్లు కదా..! దాన్ని ఎట్లా చెరిపేస్తావురా సన్నాసి..? నువ్వు మమ్మల్ని ఎన్ని తిట్టినా, ఎన్ని బూతులు మాట్లాడినా ఒకటి మాత్రం వాస్తవం.. ఆయన ఒక శిఖరం, నువ్వు ఒక శునకం. నీ స్థాయి గదే, నీ బతుకు గదే. అందుకే నీకంటే ఇవాళ తెలంగాణలో పుట్టిన ప్రతి బిడ్డకు తెలుసనన్నారు.

## ప్రత్యూష మృతి కేసులో.. సిద్ధార్థరెడ్డికి రెండేళ్ల జైలు

మొదటి పేజి తరువాయి

తగ్గించి, జరిమానాను రూ.50 వేలకు పెంచుతూ 2011 డిసెంబరు 28న తీర్పు వెలువరించింది. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ అటు నిందితుడు, అతడికి విధించిన శిక్షను పెంచాలంటూ ఇటు సరోజినీదేవి 2012లో సుప్రీంకోర్టులో అప్పీళ్లు దాఖలు చేశారు. గత ఏడాది నవంబరు 19న తీర్పు రిజర్వ్ చేసిన సర్వోన్నత న్యాయస్థానం మంగళవారం దాన్ని వెలువరించింది. ప్రత్యూష పురుగుల మందు తాగడంవల్లే చనిపోయారు తప్పితే ఆమెది హత్య కాదని స్పష్టంచేసింది. "రికార్డుల్లో ఉన్న ఆధారాలను లోతుగా పరిశీలించినప్పుడు ఆమె ఆర్గానోఫాస్ఫేట్ విషం తాగడంవల్లే మరణించినట్లు స్పష్టమవుతోంది. ఆమెపై సిద్ధార్థరెడ్డి అత్యాచారానికి పాల్పడినట్లు నిరూపితంకాలేదు. పురుగుల మందు ప్రాణాంతకం అని తెలిసీ సిద్ధార్థరెడ్డి దాన్ని కొనుగోలుచేసి ఇద్దరూ కలిసి తాగేలా మృతురాలిని పురిగొల్పాడు. అతని దోషిత్వం పూర్తిగా నిరూపితమైంది" అని సుప్రీంకోర్టు తన తీర్పులో పేర్కొంది.

**ఇదీ నేపథ్యం...**

ప్రత్యూష, సిద్ధార్థరెడ్డి 1993లో హైదరాబాద్ ఎస్ఆర్‌నగర్‌లోని ఓ కాలేజీలో ఇంటర్ చదువుతున్నప్పుడు ప్రేమలో పడ్డారు. ఇంటర్ పూర్తయిన తర్వాత సిద్ధార్థరెడ్డి ఇంజినీరింగ్‌కు వెళ్లగా, ప్రత్యూష సినిమాల్లోకి వెళ్లారు. ఇద్దరి వివాహానికి ప్రత్యూష తల్లి మొదట వ్యతిరేకించినా తర్వాత అంగీకరించారు. సిద్ధార్థరెడ్డి తల్లి మాత్రం ఆ అమ్మాయిని పెళ్లిచేసుకుంటే ఆత్మహత్య చేసుకుంటానని హెచ్చరించడం వారి వివాహానికి అడ్డంకిగా మారింది. ఆ విషయాన్ని సిద్ధార్థరెడ్డి 2002 ఫిబ్రవరి 23న ఫోన్‌ద్వారా ప్రత్యూషకు చెప్పాడు. సాయంత్రం 5 గంటల సమయంలో పంజాగుట్టలో బ్యూటీపార్లర్‌లో ఉన్న ప్రత్యూషను వెంటబెట్టుకొని కారులో బయటికి వెళ్లాడు. రాత్రి 7.30-8 గంటల మధ్యలో ఇద్దరూ ప్రాణాపాయస్థితిలో బంజారాహిల్స్‌లోని కేర్ ఆసుపత్రికి వచ్చి చేరారు. ప్రత్యూష 24వ తేదీన కన్నుమూశారు. సిద్ధార్థరెడ్డి మార్చి 9న డిశ్చార్జి అయ్యాడు. 'ఆమెను గొంతు నులిమి చంపేసినట్లు ప్రత్యూషకు తొలుత పోస్టుమార్టం చేసిన గాంధీ మెడికల్ కాలేజీ ఫోరెన్సిక్ డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్ డా.బి.మునుస్వామి నివేదిక ఇచ్చారు. ఆ రోజు విధుల్లో డా.కృపాల్‌సింగ్ ఉన్నప్పటికీ.. ఎవరూ పిలవకపోయినా వచ్చి మునుస్వామి పోస్టుమార్టం నిర్వహించారు. ఉన్నతాధికారుల నుంచి ముందస్తు అనుమతి కూడా తీసుకోలేదు' అని న్యాయస్థానం పేర్కొంది. ఈ పోస్టుమార్టం నివేదికపై వివాదం రేగడంతో ఏపీ ప్రభుత్వం దానిపై ఉస్మానియా ఆసుపత్రి, సిద్ధార్థమెడికల్ కాలేజీ, మెటర్నిటీ ఆసుపత్రులకు చెందిన ముగ్గురు డాక్టర్ల బృందంతో పాటు, దిల్లీ ఎయిమ్స్‌లోని ఫోరెన్సిక్ మెడిసిన్ బృందంతో అధ్యయనం చేయించింది. రెండు బృందాలు అత్యాచారం, హత్య ఆరోపణలను తోసిపుచ్చాయి. చికిత్స సమయంలో అయిన గాయాలను అత్యాచార గాయాలుగా డా.మునుస్వామి ప్రకటించినట్లు తెలిపాయి. దీని ఆధారంగానే సీబీఐ దర్యాప్తు నిర్వహించింది.

# క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్లు

**హైదరాబాద్:** హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల క్యూర్ (కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ)పరిధి లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి శ్రీకారం చుడుతున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ఇందుకు సంబంధించి వచ్చే మార్చి చివరినాటికి లబ్ధిదారుల ఎంపిక పక్రియను పూర్తి చేస్తామని ప్రకటించారు. మురికివాడల్లో ఇందిరమ్మ మోడల్ కాలనీలు, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి స్థలాల సేకరణ, అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణం పూర్తి, పూర్తయిన ఇండ్ల కేటాయింపు తదితర అంశాలపై మంగళవారం నాడు సచివాలయంలోని తన కార్యాలయంలో రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల ఇన్‌ఛార్జి మంత్రులు డి. శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ తో కలిసి సమీక్షించారు. ఈ సమావేశంలో హౌసింగ్ కార్యదర్శి విపి గౌతమ్, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు, మూడు మున్సిపల్ కార్పొరేషన్ల కమిషనర్లు పాల్గొన్నారు. పట్టణాల్లోని మురికివాడల్లో జీవనం కొనసాగిస్తున్న పేదలు అక్కడే ఉండడానికి ఇష్టపడుతున్నారని ముఖ్యంగా హైదరాబాద్ నగరానికి దూరంగా ఇండ్లు నిర్మించి ఇస్తే తమ జీవనోపాధికి ఇబ్బంది కలుగుతుందన్న ఉద్దేశంతో ఇండ్లు తీసుకోవడానికి ఆసక్తి చూపడం లేదని హైదరాబాద్‌కు దూరంగా గతంలో 42వేల ఇండ్లను నిర్మించగా అందులో సగం మంది మాత్రమే అక్కడ నివసిస్తున్నారని ఇటీవల నిర్వహించిన క్షేత్రస్థాయి సర్వేలో తేలిందని సమావేశంలో అధికారులు మంత్రుల దృష్టికి తీసుకువచ్చారు. అలాగే చాలాచోట్ల బోగస్ లబ్ధిదారులు కూడా ఉన్నారని అధికారులు మంత్రులకు వివరించారు. ఈ అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకొని గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి ఆలోచనలకు అనుగుణంగా ,నిరుపేదల జీవనోపాధికి ఇబ్బంది లేకుండా, వారి నివాస ప్రాంతాలకు దగ్గరగా స్థానిక పరిస్థితులను బట్టి ఐదు నుంచి 10 అంతస్థుల ఇందిరమ్మ ఇండ్లను నిర్మించాలనే ఆలోచన చే?స్తున్నామని ,వచ్చే క్యాబినెట్ సమావేశంలో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ముగ్గురు మున్సిపల్ కార్పొరేషన్ల కమిషనర్లు, నాలుగు జిల్లాల కలెక్టర్లు సమన్వయంతో వారి వారి ప్రాంతాలలో స్థలాలను గుర్తించి ఎన్ని ఇండ్లు నిర్మించవచ్చు, ఎంతమంది లబ్ధిదారులు ఉన్నారు వంటి వివరాలతో పదిరోజుల్లో నివేదిక అందజేయాలని ఆదేశించారు. క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మురికివాడల్లో స్థలం ఉన్నవారు అంగీకరిస్తే ఆ ప్రాంతంలో జీప్లస్ 5 వరకు ఇందిరమ్మ ఇండ్లను నిర్మించి అభివృద్ధి చేయాలన్న ఆలోచన చేస్తున్నామని జేఎన్ఎన్‌యూ ఆర్ ఎం పథకంలో నిర్మించిన ఇండ్లు శిథిలావస్థకు చేరాయని వాటి స్థానంలో కూడా ఇందిరమ్మ ఇండ్లు నిర్మించే ఆలోచన చేస్తున్నామన్నారు. మూడు మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో ఇండ్ల స్థలాలు ఉన్న 28వేల మంది లబ్ధిదారులకు ఈనెల చివరిలోగా ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను అందజేయాలని అధికారులను ఆదేశించారు. అసంపూర్తిగా ఉన్న, ఇప్పటికే పూర్తయిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు మార్చి చివరినాటికి లబ్ధిదారులను ఎంపిక చేయాలని ఆయా జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. అసంపూర్తిగా ఉన్న ఇండ్లకు లబ్ధిదారులను గుర్తించి ఆ లబ్ధిదారులే ఆ ఇండ్లను పూర్తి చేసుకోవడానికి అంతకుముందు ఖర్చుచేసిన మొత్తాన్ని పరిగణనలోకి తీసుకొని మిగిలిన నిధులను హౌసింగ్ కార్పొరేషన్ నిధులను మంజూరు చేస్తుందని తెలిపారు. చాలా చోట్ల ఇండ్లు తీసుకొని అక్కడ నివాసం లేని వారిని గుర్తించి నోటీసులు జారీ చేయాలని , అలాగే బోగస్ లబ్ధిదారులను కూడా గుర్తించాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అనర్హుల స్థానంలో రాజకీయాలకు అతీతంగా సమీపంలో ఉన్నఅర్హులైన పేదలను ఎంపిక చేయాలని కలెక్టర్లకు సూచించారు. 2 బిహెచ్‌కే నివాస ప్రాంతాలలోని ప్రతి ఇంటికి తాగునీరు, విద్యుత్, డ్రైనేజ్ వంటి కనీస వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్ పంపిణీ సంస్థలు విద్యుత్ మీటర్లను లబ్ధిదారుల పేర్లకు బదిలీ చేయాలని అలాగే 2బిహెచ్‌కే కాలనీల్లో తాగునీటి సరఫరా మౌలిక సదుపాయాలు, ఎస్టీపీలు, మరియు యూజీడీల వ్యవస్థ హైదరాబాద్ వాటర్ బోర్డు పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. ఓర్,ఆర్, ఆర్, - ఓ ఆర్ ఆర్ మధ్య అఫర్డబుల్ హౌసింగ్ పాలసీ ఆర్,ఆర్, ఆర్, - ఓ ఆర్ ఆర్ పరిధిలో మధ్యతరగతి ప్రజల కోసం గతంలో కెపిహెచ్‌బిలో నిర్మించిన మాదిరిగానే ఇండ్లను నిర్మిస్తామని ఇందుకు నాలుగు ప్రాంతాల్లో స్థలాలను గుర్తించి పది రోజుల్లో నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.

## మొదటి పేజి తరువాయి

### ఇంద్రేశం మున్సిపాలిటీ బీఆర్ఎస్‌దే

మున్సిపాలిటీలో బీఆర్ఎస్‌కు 19, కాంగ్రెస్‌కు 19 మం ది కౌన్సిలర్లు ఉన్నారు. దీంతో చైర్మన్ పీఠం ఎవరికి దక్కుతుందోనన్న ఉత్కంఠ నెలకొంది. స్వతంత్ర అభ్యర్థి శిరీష కాంగ్రెస్‌కు మద్దతు తెలుపడం, కాంగ్రెస్ ఎంపీ సురేశ్ షెట్కార్ ఎక్స్‌అఫీషి యో ఓటు కాంగ్రెస్‌కు వే యడంతో చైర్మన్ పీఠాన్ని కాంగ్రెస్ కైవసం చేసుకున్నది. కాంగ్రెస్ కౌన్సిలర్ యూనిస్ చైర్మన్‌గా, స్వతం త్ర కౌన్సిలర్ శిరీష వైస్ చై ర్మన్‌గా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికను రద్దు చే యాలని డిమాండ్ చేస్తూ.. మున్సిపల్ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ నాయకులు, కౌన్సిలర్లు నిరసనకు దిగారు. చైర్మన్ ఎన్నిక సందర్భంగా ఎన్నికల నిబంధనల మేరకు అక్షరమాల క్రమంలో బీఆర్ఎస్ ప్రతిపాదిత చైర్మన్ అభ్యర్థి పేరు మొదట పిలువాల్సి ఉండగా నిబంధనలను పక్కనబెట్టి కాంగ్రెస్ ప్రతిపాదించిన చైర్మన్ అభ్యర్థి పేరును మొదట పిలిచారని ఎమ్మెల్యే మాణిక్‌రావు ఆరోపించారు. చైర్మన్ ఎన్నికకు అవసరమైన మద్ద తు ఉన్నా బీఆర్ఎస్ అభ్యర్థి పదవికి దూరం కావాల్సి వచ్చిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. వెంటనే జహీరాబాద్ ఎన్నిక రద్దుచేసి, తిరిగి నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఇదే విషయమై బీఆర్ఎస్ కౌన్సిలర్ కాట స్రవంతి ఈసీకి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు.

### ఢిల్లీకి రండి..

ఆహ్వానం అందినట్టు గాంధీభవన్ వర్గాలు వెల్లడించాయి. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, పార్టీ సంస్థాగత వ్యవహారాల ఇన్‌చార్జి, ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఈ భేటీకి హాజరవుతారని తెలిపాయి. దేశంలోని అన్ని రాష్ట్రాల పార్టీ నేతలతో సమావేశమవుతున్న క్రమంలోనే తెలంగాణ నాయకత్వాన్ని కూడా పిలిచారని వివరించాయి. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, ఇన్‌చార్జి ఏఐసీసీ కార్యదర్శులు, ఏఐసీసీలో కార్యదర్శులుగా ఉన్న రాష్ట్ర నాయకులు కూడా ఢిల్లీ సమావేశానికి హాజరు కానున్నట్టు సమాచారం. పార్టీ, ప్రభుత్వ పనితీరుపై సమీక్ష?: దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడం ద్వారా 2029 పార్లమెంటు ఎన్నికల్లో ఢిల్లీ పీఠాన్ని అధిష్టించాలనే కోణంలోనే అన్ని రాష్ట్రాల పార్టీ నేతలతో ఏఐసీసీ సమావేశమవుతోంది. సంస్థాగతంగా పార్టీని ఉత్తేజితం చేయడంతో పాటు దేశ వ్యాప్తంగా నిర్వహించాల్సిన బీజేపీ వ్యతిరేక ఆందోళనలపై దిశానిర్దేశం చేయనుంది. అయితే తెలంగాణలో పార్టీ అధికారంలో ఉన్న నేపథ్యంలో ఈ సమావేశానికి ప్రాధాన్యత ఏర్పడింది. ఏఐసీసీలోని ముగ్గురు కీలక నేతలు నిర్వహించే ఈ సమావేశంలో.. తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుతో పాటు పార్టీతో సమన్వయం, పదవుల పందేరం, రాష్ట్రంలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు, ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలు, ఆరు గ్యారంటీలు, ఇతర పార్టీల పరిస్థితి, డీసీసీ అధ్యక్షుల పనితీరు, పార్టీ కార్యవర్గానికి చేస్తున్న పని విభజన తదితర అంశాలపై కూడా సమీక్ష జరగనుంది. మరీ ముఖ్యంగా రాష్ట్ర మంత్రివర్గ సభ్యుల పనితీరును గురించిన సమాచారం కూడా ఏఐసీసీ వద్ద ఉందని, ఎన్నికల్లో గెలుపోటములే కాకుండా ఆయా శాఖల్లో జరుగుతున్న కార్యకలాపాల గురించిన చర్చ కూడా ఈ సమావేశంలో జరుగుతుందని తెలుస్తోంది.

**మంత్రివర్గ విస్తరణపై స్పష్టత?**

ఈ భేటీ తర్వాత మంత్రివర్గ విస్తరణ చేయాలా లేదా? మార్పులు చేర్పులుంటాయా? అనే అంశంపై స్పష్టత వస్తుందని సమాచారం. మరోవైపు రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న కార్పొరేషన్ చైర్మన్లు, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్లు, ఇతర పోస్టుల కేటాయింపు విషయంలోనూ చర్చించి నిర్ణయం తీసుకుంటారని సమాచారం. ఈ మేరకు అంశాల వారీగా మీనాక్షి నటరాజన్ ఏఐసీసీకి ఇప్పటికే పలు నివేదికలు అందజేసినట్టు చెబుతున్నారు. కాగా ఏఐసీసీకి అందజేసేందుకు గాను..గత రెండేళ్ల కాలంలో ప్రభుత్వ పనితీరు గురించి సీఎం రేవంత్‌రెడ్డి, తాను పీసీసీ అధ్యక్షుడిని అయిన తర్వాత పార్టీని బలోపేతం చేస్తున్న తీరు, పీసీసీ కమిటీలు, ఏఐసీసీ ఇచ్చే ఆందోళనల విజయవంతం తదితర అంశాలపై పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్‌లు నివేదికలు సిద్ధం చేసుకుంటున్నట్లు తెలిసింది.

**నేడు ముంబైకి సీఎం**

సీఎం రేవంత్‌రెడ్డి ముంబైకి వెళ్లారు. బుధవారం అక్కడ జరిగే ముంబై క్లైమేట్ వీక్ కార్యక్రమంలో పాల్గొననున్నారు. తర్వాత ముంబైలోనే ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తన సతీమణి గీత.. మాతృమూర్తిని పరామర్శించనున్నారు. సాయంత్రం ఢిల్లీ వెళతారు. గురువారం ఏఐ ఎక్స్‌పో కార్యక్రమంలో పాల్గొంటారు. ఏఐసీసీ నిర్వహించే సమావేశానికి హాజరవుతారు. గురువారం రాత్రికి లేదా శుక్రవారం ఉదయానికి సీఎం హైదరాబాద్‌కు తిరిగి వస్తారని సీఎంవో వర్గాలు తెలిపాయి.

**ముఖ్యమంత్రికి అభినందనలు**

మున్సిపల్ ఎన్నికల్లో ఘన విజయం నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డికి పలువురు కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అభినందనలు తెలిపారు. మంగళవారం ఉదయం సీఎం క్యాంపు కార్యాలయంలో నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవి, మంత్రి వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యేలు కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డి, తూడి మేఘారెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డిలు ముఖ్యమంత్రిని కలిసారు. జనగామ మున్సిపల్ ఎన్నికల్లో విజయం నేపథ్యంలో భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు బీర్ల ఐలయ్య, వీర్ల శంకరయ్య, కాలె యాదయ్య, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్‌లు కూడా సీఎంను కలిసి అభినందనలు తెలిపారు. రేవంత్ కూడా పార్టీ నేతలను అభినందించారు.

### తెలంగాణ గ్రామీణ క్రీడా రంగానికి సాంకేతిక హంగులు



పెద్ద పీట వేసే లక్ష్యంతో మట్టిలో మాణిక్యాలను గుర్తించే విధంగా తెలంగాణ క్రీడా శాఖ సీఎం కప్ నిర్వహించడం అభినందనీయమని అన్నారు. యువకులు, విద్యార్థులు వ్యసనాల బారిన పడకుండా మైదానాలకు తరలి రావాలన్న ప్రభుత్వ లక్ష్యం మేరకు నిర్వహిస్తున్న ఈ పోటీల్లో దాదాపు నాలుగున్నర లక్షల మంది క్రీడాకారులు గ్రామీణ మండల అసెంబ్లీ జిల్లా స్థాయిలో పాల్గొని అందులోంచి 22,000 మంది క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం హర్షణీయమని అన్నారు. క్రీడాకారులకు ఎప్పటికప్పుడు సమాచారాన్ని తెలియజేసే విధంగా సీఎం కప్ గేమ్స్ పేరిట నీలమణి యాప్ ద్వారా ఏఐ కాల్ సెంటర్ ద్వారా 24 గంటల సమాచారాన్ని క్రీడాకారులకు అందుబాటులో ఉంచడం అభినందనీయమని అన్నారు. 44 క్రీడాంశాలు 12 జిల్లాల వ్యాప్తంగా జరుగుతున్న ఈ పోటీలు విజయవంతం కావాలని ఈ క్రీడలనుంచి మంచి ఛాంపియన్లు వృద్ధిలోకి రావాలని ఆయన అభిలాషించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ అధికారులు పలువురు పాల్గొన్నారు.

తెలుగు దినపత్రిక
https://aksharagalam.com

# అక్షరగళం

నిజం.. నిర్భయంగా



## తెలంగాణ రౌండప్

బుధవారం, 18 ఫిబ్రవరి 2026 | పేజీలు 8





# తెలంగాణ జాతిపిత కెసిఆర్

### రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి

### ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పాలు పంపిణీ చేసిన టిఆర్ఎస్ నాయకులు బిఆర్ఎస్ నాయకులు

### కల్వకుర్తిలో ఘనంగా కెసిఆర్ జన్మదిన వేడుకలు

కల్వకుర్తి ఫిబ్రవరి 17 (అక్షర గళం):

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం యావత్ తెలంగాణ ప్రజలను ఏకతాటిపై తీసుకువచ్చి తెలంగాణ ఉద్యమాన్ని ఉధృతం చేసి చావు నోట్లో తలకాయ పెట్టి తెలంగాణ సాధించిన జాతిపిత కెసిఆర్ అని తెలంగాణ స్వరాష్ట్ర ఆకాంక్షను నెరవేర్చి పదేండ్ల పరిపాలనలో అనేక సంక్షేమ పథకాలు అభివృద్ధిని సాధించి భారతదేశంలో తెలంగాణ రాష్ట్రాన్ని నెంబర్ వన్ గా సాధించిన ఘనత తెలంగాణ తొలి రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్కే దక్కుతుందని రాష్ట్ర చైర్మన్ ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి కల్వకుర్తి మాజీ మున్సిపల్ చైర్మన్ ఎడమ సత్యం అన్నారు మంగళవారం మాజీ ముఖ్యమంత్రి 72వ జన్మదిన వేడుకలను పాలమూరు చౌరస్తాలో కెసిఆర్ ఫ్లెక్సీ ఏర్పాటు చేసి కేక్ కట్ చేసి పార్టీ కార్యకర్తలు పార్టీ నాయకులకు తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి చేసిన ఘనత కెసిఆర్ కే దక్కిందని కెసిఆర్ పాలనలో రాష్ట్ర అభివృద్ధి సాధించిందని ప్రపంచ స్థాయిలో తెలంగాణ కీర్తి పతాకాన్ని ఎగరవేసిన ఘనత కెసిఆర్ దేనని పేర్కొన్నారు తెలంగాణ రాష్ట్రంలో వరి ధాన్యాన్ని పండించి భారతదేశానికి తలా మాణికం తెలంగాణ రాష్ట్రాన్ని ఆ దిశగా సాధించిన ఘనత చాటు చెప్పిన మహోన్నత వ్యక్తి కేసీఆర్ అని కొనియాడారు అనంతరం జన్మదిన వేడుకలను పురస్కరించుకొని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రాచోటి శ్రీశైలం పట్టణ అధ్యక్షుడు భావండ్ల మధు కౌన్సిలర్లు మహమ్మద్ షాహిద్ రాజు నాయక్ మాజీ కౌన్సిలర్లు భోజిరెడ్డి తహర్ అలీ వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ సింగం విజయ్ గౌడ్ బిఆర్ఎస్ కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# కేసీఆర్ మళ్లీ సీఎం కావాలి

ఆమనగల్లు, ఫిబ్రవరి 17 (అక్షర గళం):

కేసీఆర్ మళ్లీ సీఎం కావాలని ప్రజలు కోరుకుంటున్నారని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పొనుగోటి అర్జున్ రావు, సీనియర్ నాయకులు సయ్యద్ ఖలీల్ అన్నారు. కేసీఆర్ జన్మదినం సందర్భంగా మంగళవారం పట్టణ కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో కేక్ ను కట్ చేసి మాట్లాడారు. అధికార పార్టీ అభివృద్ధిని మరిచిందని, సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు కావడం లేదని ఆరోపించారు. కాంగ్రెస్ హయాంలో అన్నివర్గాల వారు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. పూటకో మాట మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు ప్రజలను మోసగిస్తున్నారని మండిపడ్డారు. రైతులు, ప్రజలు ధైర్యంగా ఉండాలని.. వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని భరోసా ఇచ్చారు. అభివృద్ధి కుంటుపడిందని, రాష్ట్ర ప్రభుత్వం ఎంతమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు గుత్తి బాలస్వామి, నూతన కౌన్సిలర్లు దుడ్డు ఆంజనేయులు యాదవ్, ఏనుమల రమేష్, నాగిళ్ళ జగన్, అనూష శ్రీశైలం, ఎంగలి భాగ్యమ్మ రఘు, సర్పంచ్ శ్రీను నాయక్, మాజీ కౌన్సిలర్ కమటం వెంకటయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ నిరంజన్ గౌడ్, యూత్ వింగ్ అధ్యక్షుడు దేరంగుల వెంకటేష్, వడ్డేమోని శివకుమార్, కొమ్ము ప్రసాద్, సైదులు గౌడ్, కాలే విక్రమ్, కోట శీను, శంకర్, జంగయ్య, లండం యాదయ్య, గుజ్జరి గోపి, పరమేష్, రంజిత్, శంకర్, రమేష్, నిరంజన్, కిషోర్, శివ పాల్గొన్నారు.



# 'ద్రోహులకు ప్రజలే బుద్ధి చెబుతారు'

### సయ్యద్ ఖలీల్

ఆమనగల్లు, ఫిబ్రవరి 17 (అక్షర గళం):

పార్టీ నుంచి గెలిచి ద్రోహం చేసి మరో పార్టీలోకి వెళ్లేవారికి ప్రజలే బుద్ధి చెబుతారని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సయ్యద్ ఖలీల్ పేర్కొన్నారు. మంగళవారం పట్టణ కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో కెసిఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని నూతనంగా బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలుపొందిన కౌన్సిలర్లు దుడ్డు ఆంజనేయులు యాదవ్, ఏనుమల రమేష్, నాగిళ్ళ జగన్, అనూష శ్రీశైలం, ఎంగలి భాగ్యమ్మ రఘు లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు గుత్తి బాలస్వామి, సర్పంచ్ శ్రీను నాయక్, మాజీ కౌన్సిలర్ కమటం వెంకటయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ నిరంజన్ గౌడ్, యూత్ వింగ్ అధ్యక్షుడు దేరంగుల వెంకటేష్, వడ్డేమోని శివకుమార్, కొమ్ము ప్రసాద్, సైదులు గౌడ్, కాలే విక్రమ్, కోట శీను, శంకర్, జంగయ్య, లండం యాదయ్య, గుజ్జరి గోపి, పరమేష్, రంజిత్, శంకర్, రమేష్, నిరంజన్, కిషోర్, శివ పాల్గొన్నారు.





# రాజకీయంగా ఎదుర్కోలేకనే అక్రమ కేసులు

- ఆర్యవైశ్యులను అణిసి వేసేందుకే కాంగ్రెస్,బిజెపి ఏకం అయ్యాయి.
- అక్రమ కేసులు ఎత్తివేయాలని ఆర్యవైశ్యుల డిమాండ్
- రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతాం.
- కల్వకుర్తి బందుకు సంపూర్ణ మద్దతు తెలుపండి
- ఆర్యవైశ్య మహాసభ నాయకులు గంధం ప్రసాద్ దాచేపల్లి శ్రీనివాసులు



కల్వకుర్తి ఫిబ్రవరి 18 (అక్షర గళం ):

ఆర్యవైశ్యులను రాజకీయపరంగా అనగతొక్కేందుకు కాంగ్రెస్, బిజెపి పార్టీలు కుట్రలు పన్ని రాజకీయంగా ఎదురుకునే దమ్ము, ధైర్యం లేక ఎలాంటి సంబంధం లేని ఆర్యవైశ్యులైన బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సామాజిక వేత్త పాపిశెట్టి రాము పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయించడం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి రాజకీయ కుట్రతో అక్రమ కేసు బనాయించడం ఆర్యవైశ్యులకు తీరని ద్రోహం చేశారని ఆర్యవైశ్య మహాసభ మండల శాఖ అధ్యక్షుడు గంధం ప్రసాద్, మాజీ అధ్యక్షుడు దాచేపల్లి శ్రీనివాసులు తీవ్ర స్థాయిలో ధ్వజం ఎత్తారు మంగళవారం కల్వకుర్తి శ్రీ శ్రీ శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి దేవాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మీడియాతో మాట్లాడుతూ అక్రమ కేసులకు నిరసనగా బుధవారం కల్వకుర్తి ఆర్యవైశ్యులకు చెందిన వ్యాపార సంస్థలన్నీ మూసి ఉంచి ఆర్యవైశ్యులకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఆమనగల్ ముంచిపాలటీలో గత 35 సంవత్సరాలుగా అభివృద్ధి చెందకపోవడంతో ప్రజలు బిజెపి పార్టీని కాంగ్రెస్ ను తిరస్కరించారని పేర్కొన్నారు. ఆమనగల్, కల్వకుర్తి మున్సిపాలిటీలో ఏ ఒక్క పార్టీ ఆర్యవైశ్యులకు స్థానం కల్పించలేదని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఉప్పల వెంకటేష్ ఒంటరి పోరాటంతో ఆమనగల్లో ఎనిమిది స్థానాలు రాజ్యాంగబద్ధంగా కైవసం చేసుకుంటే ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి బిజెపి, కాంగ్రెస్ పార్టీలు అపవిత్ర కలయికతో ఆర్యవైశ్య సంఘానికి చెందిన పాపిశెట్టి రాముకు మున్సిపల్ చైర్మన్ పదవి దక్కకుండా ఒకే ఒక్క స్థానం కాంగ్రెస్ పార్టీ, బిఆర్ఎస్ పార్టీకి చెందిన పత్యా నాయక్ ను పార్టీలో చేర్చుకొని ప్రలోభాలకు గురిచేసి చైర్మన్ పదవిని ఆశ చూపి పాపిశెట్టి రాము కు మున్సిపల్ చైర్మన్ పదవి దక్కకుండా క్షుద్ర రాజకీయాలకు ఎక్కడా లేని విధంగా బిజెపి కాంగ్రెస్ చీకటి ఒప్పందంతో మున్సిపల్ చైర్మన్ తో పాటు వైస్ చైర్మన్ పదవులు దక్కించుకొని రాజకీయ వ్యభిచారానికి పాల్పడ్డారని ఆరోపించారు. బి ఆర్ ఎస్ పార్టీ నుండి గెలిచిన పత్యా నాయక్ ఆసుపత్రి ఇంటిపై దాడి అక్కడ వార్డు ప్రజలే దాడి చేశారని అన్నారు.దాడి కి ఎలాంటి సంబంధం లేని ఉప్పల వెంకటేష్ పాపిశెట్టి రాముపై అంటగట్టి అక్రమ కేసులు బనాయించడానికి తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి బిజెపి నేత తల్లోజు ఆచారి పదేపదే ఆర్యవైశ్యులు దొంగ బియ్యం అమ్ముకుంటున్నారని ఆరోపించడం ఎంతవరకు సమన్యసమని ఆర్యవైశ్యులు ఒక్కరే వ్యాపారాలు చేస్తున్నారా అని ఇతర కులాలు వ్యాపారం చేయడం లేదా అని అక్రమ వ్యాపారంలో వాటాలు తీసుకొని గురువింద సామెత ఎల్ల బోస్తున్నారని విమర్శించారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆచారి చేసిన అవినీతి అక్రమాలు నియోజకవర్గ ప్రజలకు తెలుసని అన్నారు. పాపిశెట్టి రాముపై ఆచారి వ్యాపారం పరంగా బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆర్యవైశ్యులు చూస్తూ ఊరుకోరని ఆచారి కి తగిన గుణపాఠం చెప్తామని హెచ్చరించారు. ఉప్పల వెంకటేష్ పాపిశెట్టి రాము పై పెట్టిన కేసులు ప్రభుత్వం బేషరతుగా ఉపసంహరించుకోవాలని లేనియెడల రాబోయే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేయడానికి ఆర్య వైశ్యులు సిద్ధంగా ఉన్నారని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గంప శ్రీనివాసులు ఆర్యవైశ్య సంఘం నాయకులు దొంతు శ్రీనివాసులు, నరసింహులు గుప్తా, పూరి రమేష్, దాచేపల్లి మనోహర్, సామల నరసింహ, దాచేపల్లి తిరుపతయ్య, ఎల్లికల్ రాజు, శివ తదితరులు పాల్గొన్నారు.





# చైర్మన్, వైస్ చైర్మన్ లకు ఘన సన్మానం

ఆమనగల్లు, ఫిబ్రవరి 17 (అక్షర గళం):

ఆమనగల్లు మున్సిపాలిటీ చైర్మన్ పత్యానాయక్, వైస్ చైర్మన్ తల్లోజు గీత ఆచారి లను మాజీ ఎంపీపీ అనిత విజయ్ మంగళవారం వారి వారి పార్టీ కార్యాలయాల్లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూలబొకే అందించి పూలమాల శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. నూతనంగా ఎన్నికైన పాలకవర్గం ప్రజలకు అందుబాటులో ఉంటూ.. సమస్యల పరిష్కారానికి ముందుండి పనిచేయాలని తెలిపారు. ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చూడాలని అన్నారు. రాజకీయాలకు అతీతంగా పనిచేసి మంచి పేరు తెచ్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు దేవేందర్, తావుర్య నాయక్, మల్లేష్ నాయక్, సురేష్ నాయక్, రాజ్ కుమార్, కృష్ణ నాయక్, భాస్కర్, జయరాం నాయక్, మణిపాల్, రాజా, నరేష్, రాజేందర్, కిషన్, వసంత్, రాములు, శ్రీను, కుమార్, నవీన్ తదితరులు ఉన్నారు.





# ఘనంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలు

వెల్దండ ఫిబ్రవరి 17 (అక్షర గళం):

వెల్దండ మండల కేంద్రంలోని టిఆర్ఎస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి వెల్దండ మండల బి ఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ఆధ్వర్యంలో వెల్దండ బస్టాండ్ ఆవరణంలో ఘనంగా తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు వెల్దండ మండల వివిధ గ్రామాల బి ఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిలో పండ్ల పంపిణీ చేశారు ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని అన్నారు ఈ కార్యక్రమంలో వెల్దండ మాజీ ఎంపీపీ పుట్ట రామ్ రెడ్డి మాజీ వైస్ ఎంపీపీ ఐజాక్ పోతే పల్లి సర్పంచ్ కొండల్ యాదవ్ మాజీ ఎంపీటీసీ నాగుల్ నాయక్ హనుమంతు నాయక్ చెర్కూర్ మాజీ ఎంపిటిసి భీమయ్య గౌడ్ వెల్దండ మాజీ ఎంపీటీసీ జ్యోతి నిరంజన్ మాజీ ఎంపీటీసీ లింగం కుప్పగండ్ల మాజీ సర్పంచ్ శేఖర్ ముదిరాజ్ మాజీ ఉప సర్పంచ్ జంగిల్ నిరంజన్ నరసింహ సీనియర్ నాయకులు చంద్రమోహన్ మాజీ మండల అధ్యక్షులు జోగయ్య జంగిలి ప్రసాద్ ఆర్కే గౌడ్ కొమ్ము నాగేష్ యువ నాయకులు జంగిల్ ఆనంద్ పోతే అశోక్ జంగిలి ప్రవీణ్ జంగిలి రవికుమార్ జంగిలి శ్రీనివాసులు గోరేటి రాజు రవీందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు





# గ్రామాభివృద్ధిలో ఉప సర్పంచ్, వార్డు సభ్యుల పాత్ర కీలకం

### ఎంపీడీఓ కుసుమ మాధురి

**ఆమనగల్లు, ఫిబ్రవరి 17 (అక్షర గళం):**

గ్రామాభివృద్ధిలో సర్పంచుల తరువాత ఉప సర్పంచ్, వార్డు సభ్యుల పాత్ర చాలా కీలకం అని ఎంపీడీఓ కుసుమ మాధురి అన్నారు. మంగళవారం పట్టణ కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని గ్రామపంచాయతీ ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు ఐదు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. మహిళా ఉప సర్పంచులు, వార్డు సభ్యులు పెత్తనం భర్తల చేతికి అందించకుండా శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగ పరచుకోవాలని సూచించారు. మీ గ్రామంలో ఏం చేయాలి.. ఎలా చేయాలని ఒక ప్రణాళిక రూపొందించుకోవడానికి శిక్షణ తోడ్పడుతుంది అన్నారు. డ్రింకింగ్ వాటర్, పారిశుధ్యం, సీసీ రోడ్లు ఒక మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల నుంచి వచ్చే గ్రాంట్ లు గ్రామ పంచాయతీకి వచ్చే ఆదాయం అన్ని చూసుకొని ఖర్చు చేసే బాధ్యత అందరికి ఉంటుందన్నారు. వార్డు సభ్యులు, పంచాయతీ తీర్మానాల ఆధారంగా అభివృద్ధి పనులు పారదర్శకంగా నిర్వహించాలన్నారు. సమావేశంలో ఎంపీఓ లక్ష్మణ్, ఏపీ మాధవరెడ్డి, ట్రైనర్స్ ప్రసాద్, చంద్రశేఖర్, రవీందర్ నాయక్ మరియు ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు ఉప సర్పంచులు విజయ రాథోడ్, జ్యోతి, శ్రీనివాసులు, సురేష్ తదితరులు ఉన్నారు.



## చైర్మన్ పత్యనాయక్ కు శుభాకాంక్షలు తెలిపిన ఖలీల్

**ఆమనగల్లు, ఫిబ్రవరి 17 (అక్షర గళం):**

ఆమనగల్లు మున్సిపాలిటీ చైర్మన్ పత్యనాయక్ ను బ్లాక్ కాంగ్రెస్ మాజీ ఉపాధ్యక్షుడు, సీనియర్ నాయకులు ఎంఏ ఖలీల్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మున్సిపల్ చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా పూలమాల శాలువతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చూడాలని, రాజకీయాలకతీతంగా పనిచేసే మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. ఆయన వెంట రఫీ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాసేవతోనే సమాజంలో గుర్తింపు



### మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్

**ఆమనగల్లు, ఫిబ్రవరి 17 (అక్షర గళం):**

ప్రజాసేవతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ అన్నారు. ఆమనగల్లు మున్సిపల్ చైర్మన్ గా ఎన్నికైన పత్యనాయక్ ను మంగళవారం పట్టణ కేంద్రంలో ఆయన శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం రాములు నాయక్ మాట్లాడుతూ.. పేదలకు అండగా ఉండి నిత్యం ప్రజల్లోనే ఉండాలన్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ.. సమస్యల పరిష్కారానికి ముందుండి పనిచేయాలన్నారు. ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చూడాలని అన్నారు. రాజకీయాలకు అతీతంగా పనిచేసి మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆదివాసి రాష్ట్ర నాయకులు కృష్ణ నాయక్, రాగ్య నాయక్, అబ్దుల్ అలీమ్, ఎన్ఎస్ఈయుఐ రాష్ట్ర కార్యదర్శి ఎండి ఫరీద్, సురేష్ నాయక్, నాజర్, శ్రీను నాయక్, విజేందర్, రఫీ, గోపాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.




# రక్షణ చట్టం తీసుకురావాలి

### ఆమనగల్లు బార్ అసోసియేషన్ అధ్యక్షులు యాదిలాల్

**ఆమనగల్లు, ఫిబ్రవరి 17 (అక్షర గళం):**

వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో న్యాయవాదుల రక్షణ చట్టం తీసుకురావాలని ఆమనగల్లు బార్ అసోసియేషన్ అధ్యక్షులు అండేకార్ యాదిలాల్ పేర్కొన్నారు. తెలంగాణ హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షులు జగన్ అధ్యక్షతన మంగళవారం జరిగిన న్యాయవాదుల ప్రొటెక్షన్ ఏర్పాటుపై చర్చ సమావేశంలో యాదిలాల్ పాల్గొని మాట్లాడారు.. రాష్ట్రంలో ఏదో ఒక మూలన న్యాయవాదులపై దాడులు జరుగుతూనే ఉన్నాయన్నారు. న్యాయవాదుల మీద శారీరక దాడులు, భద్రతా సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో వారి భద్రతను పెంచేందుకు విస్తృత చర్యలు తీసుకోవాలని ఆయన సభ దృష్టికి తెచ్చారు. ప్రభుత్వం న్యాయవాదుల భద్రతను ఎప్పటికప్పుడు పరిశీలించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో న్యాయవాదుల రక్షణ చట్టాన్ని రూపొందించి దానిని పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ త్వరలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విన్నవించాలని సమావేశంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు ముక్త కంఠంతో తీర్మానించినట్లు యాదిలాల్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.



## నూతన మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లని సన్మానించిన కల్వకుర్తి యువజన కాంగ్రెస్ నాయకులు

**కల్వకుర్తి పిబ్రవరి 18 (అక్షర గలం):**

కల్వకుర్తి పట్టణంలో నూతనంగా ఎన్నికైనటువంటి కల్వకుర్తి మున్సిపాలిటీ చైర్మన్ గా బృంగి రత్నమాల ఆనందుకుమారు, కౌన్సిలర్లు లలితా శ్రీకాంత్ రెడ్డి,లలిత గణేష్ యాదవ్, అస్మిత చంద్రకాంత్ రెడ్డి లను యువజన కాంగ్రెస్ నాయకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు అనిల్ గౌడ్, బాలరాజు, వంశీ, జంగయ్య గౌడ్, శివ ప్రసాద్,మాలిక్, అన్వర్ పాషా , వినోద్ , తదితరులు పాల్గొన్నారు.



### పాత పద్ధతితోనే యూరియా పంపిణీ చేయాలని బిఆర్ఎస్ పార్టీ నాయకులు

# తహసిల్దార్ కార్తీక్ కుమార్ కి వినతి పత్రం అందజేత

**వెల్దండ ఫిబ్రవరి 17 (అక్షర గళం):**

యాప్‌తో సంబంధం లేకుండా రైతులకు యూరియా పంపిణీ చేయాలని వెల్దండ మండల బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో తహసిల్దార్ కార్తిక్ కుమార్ కు మంగళవారం తహసిల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ.. రైతుల వద్ద ఉన్న చిన్న ఫోన్లలో ఫర్టిలైజర్ యూరియా యాప్ లేదని, వారికి అవసరమైన యూరియా బస్తాలు ఎలా పొందుతారని ప్రశ్నించారు. యాప్ లో బుక్ చేస్తుండగానే క్షణాల్లో అయిపోతున్నాయని, పాత పద్ధతి ద్వారానే రైతులకు యూరియా పంపిణీ చేయాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ భీమయ్య గౌడ్ హనుమంతు నాయక్ వెంకటయ్య, మాజీ ఉప సర్పంచ్ జంగిల్ నిరంజన్, బీఆర్ఎస్ పార్టీ మండల యువ నాయకులు పోలే అశోక్ నాయక్,ఉప సర్పంచ్ నరసింహా, వార్డు సభ్యులు గోపిరెడ్డి రాఘవరెడ్డి, మాజీ వార్డు సభ్యులు జంగిలి ప్రసాద్, బాల్ జంగయ్య, ధన్సింగ్ నాయక్, తుంగ శ్రీను తదితరులు పాల్గొన్నారు.



## మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

**యాచారం, అక్షరగళం:**

మండల పరిధిలోని చౌదర్ పల్లి గ్రామానికి చెందిన కొమ్ము సాయి కిషోర్ ఇటీవల అనారోగ్యంతో మరణించాడు. మంగళవారం బిజెపి యాచారం మండల ప్రధాన కార్యదర్శి నడికుడి కృష్ణ పలువురుతో కలసి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చి దైర్యం చెప్పారు. మంచితనానికి మారుపేరుగా ఉన్నటువంటి వ్యక్తి దూరమావడం బాధాకరం అన్నారు. భవిష్యత్తులో సాయి కిషోర్ కుటుంబానికి కష్టసుఖాల్లో అండగా ఉంటానన్నారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులకు 10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు కొమ్ము యాదయ్య, కావలి కిరణ్, గ్రామస్తులు కొమ్ము మల్లయ్య, శ్రీనగరం రమేష్, సంగం యాదయ్య, ముక్కెరి ప్రభాకర్, పగిల్ల వేణు తదితరులున్నారు.





## బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం ప్రారంభం

**వెల్దండ ఫిబ్రవరి 17 (అక్షర గళం):**

వెల్దండ మండల కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి మంగళవారం బిఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రత్యేక పూజలు చేసి కార్యాలయాన్ని ప్రారంభించారు ఈ కార్యక్రమంలో వెల్దండ మాజీ ఎంపీపీ పుట్టా రాంరెడ్డి వైస్ ఎంపీపీ ఐజాక్ బిఆర్ఎస్ పార్టీ మండల మాజీ అధ్యక్షులు కానుగుల జోగయ్య మాజీ ఎంపీటీసీ జ్యోతి నిరంజన్ మాజీ ఎంపీటీసీ లింగం మాజీ ఎంపీటీసీ నాగుల నాయక్ హనుమంతు నాయక్ పోతే పల్లి సర్పంచ్ కొండల్ యాదవ్ చెర్కూర్ మాజీ ఎంపీటీసీ భీమయ్య గౌడ్ కుప్పగండ్ల మాజీ సర్పంచ్ మొక్తాల శేఖర్ ఆర్కే గౌడ్ యువ నాయకులు జంగిలి ఆనంద్ పోలే అశోక్ వెంకటయ్య జంగిలి ప్రవీణ్ జంగిలి రవికుమార్ రెడ్డి రాజు తదితరులు పాల్గొన్నారు

# కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి సాధించింది

### వివేకానంద నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ మాధవరం రోజా దేవి

**అక్షర గళం, శేరిలింగంపల్లి:**

తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి సాధించిందని వివేకానంద నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ మాధవరం రోజా దేవి అన్నారు. సోమవారం తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు జన్మదినం సందర్భంగా వివేకానంద నగర్ డివిజన్ మాధవరం కాలనీ లో గల డివిజన్ పార్టీ కార్యాలయం దగ్గర మాజీ కార్పొరేటర్ మాధవరం రోజా దేవి ఆధ్వర్యంలో కేసీఆర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తల తో కలిసి కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. రైతులకు, మహిళలకు, పేదలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి ప్రజల జీవితాల్లో మార్పు తీసుకువచ్చారు. ఆయన చూపిన అభివృద్ధి దిశలోనే మేము పనిచేస్తూ ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించడానికి కట్టుబడి ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో గొట్టుముక్కల పెద్దభాస్కర్ రావు ,మాచర్ల భద్రయ్య,




ఆంజనేయులు,బాబూరావు , ప్రవీణ్,విక్రమ్,ఈశ్వర్,వెంకట్ రెడ్డి,శ్రీనివాస్,రమణ రెడ్డి,రాజు ,సిల్వర్ మనీష్, సత్యనారాయణ,బాబు, రామచందర్, సోమయ్య,కొండలరావు, అనిల్ ,లక్ష్మణ్ ,నరసింహ రెడ్డి, వాసు, విద్యాసాగర్, రామారావు, శ్రీధర్, వెంకన్న, శేఖర్, రాము, శ్రీధర్ రావు, మురళి, రాజశేఖర్, వెంకటేశ్వర రావు, జై,కుమార్ యాదవ్, శ్రీనివాస్, వాసు,విజయ్ సాగర్,కిషన్ ,సోమేష్,రాజు,కేబుల్ రమేష్, రవీందర్, అరవింద్,నరేష్, సంతోష్, రామ్మూర్తి, రాజుయాదవ్,బిందెల్ రాము,శ్రీనివాస్ యాదవ్, సంతోష్, జగదీష్,నవీన్, వినయ్, మోహన్ చారి,రాము,సంతోష్, అనిత, శైలజ, రాధిక, కరుణ, అనురాధ,శ్రావణి తదితరులు పాల్గొన్నారు.




## రాజేశ్వరి వృద్ధాశ్రయంలో కేసీఆర్ జన్మదిన వేడుకలు

**అక్షర గళం, ఆల్విన్ కాలనీ:**

స్వచ్ఛంద సంస్థలు వృద్ధాశ్రమంలో సేవ చేయడానికి ముందుకు రావాలని ఆకాంక్ష ఫౌండేషన్ వ్యవస్థాపకులు రామారావు, కూకట్ పల్లి ఉమ్మడి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎర్ర యాకన్న ప్రజలను కోరారు. మంగళవారం శేర్లింగంపల్లి నియోజకవర్గం ఆల్విన్ కాలనీ డివిజన్ సాయి నగర్ ప్రాంతంలోని రాజేశ్వరి వృద్ధాశ్రయంలో ఆకాంక్ష ఫౌండేషన్ వ్యవస్థాపకులు చిట్నీడి వెంకట రామారావు ఆధ్వర్యంలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదినం సందర్భంగా ఆయన పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాతలు వృద్ధాశ్రమంలో ఏదైనా సందర్భంగా పండ్లు గాని, ఆహారం కానీ పంపిణీ చేయడానికి సహాయ సహకారాలు అందించడానికి ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కూకట్పల్లి ఉమ్మడి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎర్ర యాకన్న, ప్రముఖ వ్యాపారవేత్త సాయి, స్వాతి, రాజేశ్వరి వృద్ధాశ్రమం వ్యవస్థాపకులు రాజేశ్వరి, మురళి, కావాలి కృష్ణయ్య, వివేక్, వెంకట్ , రాజు, నరసింహ తదితరులు పాల్గొన్నారు.




## ఉప్పల వెంకటేష్ పై పెట్టిన అక్రమ కేసుకు నిరసనగా

# బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రాస్తారోకో నిరసన

### ఆమనగల్ లో ప్రజాస్వామ్యం కూని

### కల్వకుర్తి మాజీ మున్సిపల్ చైర్మన్ ఎడమ సత్యం

**కల్వకుర్తి ఫిబ్రవరి 17 (అక్షర గళం ):**

ప్రజాస్వామ్యాన్ని అపవాసం చేశారని ఆమనగల్ మున్సిపాలిటీలో జరిగిన పరిణామాలు ఇందుకు నిదర్శనమని అధికారాన్ని అడ్డం పెట్టుకొని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి రాజకీయ కక్ష సాధింపులో భాగంగా బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఉప్పల వెంకటేష్ మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి పాపిశెట్టి రామ్ పై అక్రమంగా పెట్టిన ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసును ఎత్తివేయాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి మాజీ మున్సిపల్ చైర్మన్ ఎడమ సత్యం తీవ్రంగా ఖండించారు మంగళవారం బిఆర్ఎస్ ఆర్యవైశ్య సంఘం నాయకులతో కలిసి పాలమూరు చౌరస్తాలో రాస్తారోకో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆమనగల్లో బిఆర్ఎస్ పార్టీ తరపున గెలిచిన కౌన్సిలర్ను ప్రలోభాలకు గురిచేసి పార్టీలో చేర్చుకొని మున్సిపల్ చైర్మన్ ను ప్రకటించుకోవడం ఎంతవరకు సమన్యసమని కేవలం ఒక స్థానానికే పరిమితమైన కాంగ్రెస్ పార్టీ ఆమనగల్ మున్సిపాలిటీలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.



## నేడు ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో

# తాసిల్దార్‌కు వినతి పత్రం

### మండల ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు గంధం కిరణ్ ప్రసాద్

**కల్వకుర్తి ఫిబ్రవరి 17( అక్షర గళం):**

ఆర్యవైశ్య సంఘం నాయకులు బి ఆర్ ఎస్ రాష్ట్ర నాయకులు ఉప్పల వెంకటేష్ ఆమనగల్ మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి పాపిశెట్టి రాముపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ కల్వకుర్తి పట్టణంలో వ్యాపార సముదాయాలు అన్నిటిని ఆర్యవైశ్యులు మూసివేసి నిరసన తెలపాలని కల్వకుర్తి ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు గంధం కిరణ్ ప్రసాద్ మంగళవారం మీడియాకు తెలిపారు. ఉదయం 8 గంటలకు కన్యకా పరమేశ్వరి దేవాలయం నుండి కార్యక్రమం ప్రారంభమవుతుందని వాసవి క్లబ్, అవోపా, వాసవి సేవా ట్రస్ట్ అనుబంధ సంఘాలు పాల్గొని నిరసన తెలిపి అనంతరం తాసిల్దార్ కు వినతి పత్రం అందజేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు దాచేపల్లి శ్రీనివాసులు, గంప శ్రీను, తిరుపతయ్య, మనోహర్, రాజు తదితరులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యేకు బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రిక అంజజేత

**కల్వకుర్తి ఫిబ్రవరి 17( అక్షర గళం):**

కల్వకుర్తి నియోజకవర్గ పరిధిలోని మాడుగుల మండల కలకొండ లో ఈనెల 18 19 జరిగే జాతర ఉత్సవాలకు హాజరుకావాలని మంగళవారం హైదరాబాదులో ఎమ్మెల్యే నివాసములో ఆహ్వాన పత్రికను మాజీ జెడ్పిటిసి ప్రభాకర్ రెడ్డి ఓం ప్రకాష్ రెడ్డి జగన్ గౌడ్ వెంకటేష్ గౌడ్ అందజేశారు. అనంతరం తలకొండపల్లి మండల గౌరిపల్లి కి చెందిన సుజాతకు 5 లక్షల ఎల్ ఓ సి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో తలకొండపల్లి మండల అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.



# ప్రకృతి వ్యవసాయంతో రైతులకు ఎన్నో ప్రయోజనాలు

**ఆమనగల్లు, ఫిబ్రవరి 17 (అక్షర గళం):**

ప్రకృతి వ్యవసాయంతో రైతులకు ఎన్నో ప్రయోజనాలున్నాయని రిసోర్స్ అధికారి వరికుప్పల శైలజ అన్నారు. మండల పరిధిలోని పోలేపల్లి గ్రామంలో ఉన్న రైతు వేదిక భవనంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పోలేపల్లి, కొత్తకుంట తండా గ్రామపంచాయతీల రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రిసోర్స్ అధికారి వరికుప్పల శైలజ మాట్లాడుతూ.. ప్రకృతి వ్యవసాయం సాగు వలన రైతులకి, భూమికి, పర్యావరణానికి, ప్రధాన పంట వినియోగదారునికి కలిగే ప్రయోజనాలు వివరించారు. ఈ సందర్భంగా ఆమె వివిధ రకాల విత్తనాలను వేయడం ద్వారా ఎకరాకు వచ్చే పంట దిగుబడిపై రైతులకు అవగాహన కలిగించారు. కార్యక్రమంలో ఏఈవో ప్రభావతి మరియు రైతులు పాల్గొన్నారు.

## తొలి ముఖ్యమంత్రి కెసిఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు

**అక్షర గళం, కుత్బుల్లాపూర్:**



తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కెసిఆర్ జన్మదినం సందర్భంగా సోమవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు శంభీపూర్ క్రిష్ణ గజ్వేల్ లోని ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ను మర్యాదపూర్వకంగా కలిసి పూలే బొకే ను అందించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు.

## తలకొండపల్లి మండలంలో 11 కెవి విద్యుత్ ఫీల్డర్లను ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభం

### తలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్ రెడ్డి

**కల్వకుర్తి ఫిబ్రవరి 17 (అక్షర గళం):**



కల్వకుర్తి నియోజకవర్గ పరిధిలోని ఆమనగల్ కడ్తాల్ తలకొండపల్లి మండలాలలో ఓవర్ లోడ్ లోవుల్టేజ్ సమస్యలతో ఇబ్బంది పడుతున్న రైతులు గ్రామస్తుల సమస్యలను పరిష్కరించేందుకు బుధవారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి హాజరవుతున్నట్లు తలకొండపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్ రెడ్డి మంగళవారం మీడియాకు తెలిపారు. ఉదయం 10 గంటలకు కర్కల్పహాడ్ 10 45కు రావిచెడ్ 11:30 కు వెలజాల్ మధ్యాహ్నం 12 :15 కు గట్టుప్పలపల్లికి చేరుకుంటారని ఈ కార్యక్రమాని విజయవంతం చేయాలని మండల ముఖ్య నాయకులు ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ కుటుంబ సభ్యులు గ్రామస్తులు పాల్గొని విజయవంతం చేయాలని డోకూరి ప్రభాకర్ రెడ్డి కోరారు.



## గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

**వెల్దండ ఫిబ్రవరి 17 (అక్షర గళం):**

వెల్దండ మండల పరిధిలోని హైదరాబాద్ శ్రీశైలం జాతీయ రహదారిపై రాఘాయిపల్లి గేటు సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో వెల్దండ మండల పరిధిలోని కుప్పగండ్ల గ్రామానికి చెందిన ఊర వెంకటయ్య అక్కడికక్కడనే మృతి చెందారు మృతదేహాన్ని కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు ఈ మేరకు పోలీసులు సంఘట స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు

## ఇతర దేశాల ఆదేశాలు ఇక్కడ పనిచేయవు

**ఢాకా:** బంగ్లాదేశ్‌లో రాడికల్ శక్తులకు సహాయం చేయడం, మైనారిటీ హిందువులను రక్షించడంలో విఫలమయ్యారని విమర్శలు ఎదుర్కొంటున్న బంగ్లా తాత్కాలిక పాలకుడు మహ్మద్ యూనస్ దిగిపోతూ భారత్‌పై తన అక్కసును వెళ్లగక్కారు. భారతదేశ సార్వభౌమాధికారాన్ని ధిక్కరిస్తూ, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. 2024లో హసీనా తన పదవికి రాజీనామా చేసి, భారత్ పారిపోయి వచ్చిన తర్వాత యూనస్ అధికారం చేపట్టి బంగ్లాలో భారత వ్యతిరేకతను పెంచి పోషించాడు. తాజాగా ఆయన చేసిన ప్రసంగంలో భారత్‌పై తన వ్యతిరేకతను వెల్లడించారు. విదేశాంగ విధానంలో బంగ్లాదేశ్ సార్వభౌమాధికారం, గౌరవం, స్వాతంత్ర్యాన్ని తిరిగి పొందిందని, ఇకపై ఇతర దేశాల ఆదేశాలపై పనిచేయదని చెప్పారు. భారత్‌ను లక్ష్యంగా చేసుకుంటూ ఈ వ్యాఖ్యలు చేశాడు. భూటాన్, నేపాల్, 'సెవెన్ సిస్టర్స్'తో బంగ్లాదేశ్ అపారమైన ఆర్థిక సామర్థ్యాన్ని కలిగి ఉందని చెప్పారు. భారతదేశంలోని అంతర్భాగమైన 7 ఈశాన్య రాష్ట్రాలను ఉద్దేశించి యూనస్ ఈ వ్యాఖ్యలు చేశారు. తన హయాంలో చైనా, జపాన్, యూఎస్ఏ, యూరప్‌తో బంగ్లా సంబంధాలను పెంచానని, భారతదేశ వ్యూహాత్మక 'సిలిగురి కారిడార్'కు సమీపంలోని తీస్తా నదిపై చైనా సహాయంతో ప్రాజెక్టులు కడుతున్నామని చెప్పారు.

# గంజాయితో మహాశివుడికి అపచారం

**హైదరాబాద్:** శివరాత్రి పర్వదినం వేళ గంజాయి బ్యాచ్ రెచ్చిపోయింది. దేవాలయం వద్ద శివునికి గంజాయిని ప్రసాదంగా సమర్పించబోయారు కొందరు ప్రబుద్ధులు. అంతేకాదు.. దీనిని వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. దీంతో ఆ వీడియో కాస్తా వైరల్‌గా మారింది. దీనిని చూసిన నెటిజన్లు.. సదరు వ్యక్తుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విషయాన్ని నేరుగా హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్‌కి దృష్టికి తీసుకెళ్లారు. ఈ వ్యవహారంపై సీరియస్‌గా స్పందించిన సీపీ సజ్జనార్.. వీడియోలోని వ్యక్తులపై చర్యలు తీసుకోవాలంటూ పోలీసు సిబ్బందిని ఆదేశించారు. సీపీ ఆదేశాలతో రంగంలోకి దిగిన పోలీసులు.. సదరు గంజాయి బ్యాచ్‌ను పట్టుకునేందుకు గాలింపు చర్యలు చేపట్టారు. పోలీసుల కథనం ప్రకారం.. హైదరాబాద్‌లోని శంషాబాద్ ధర్మగిరి దేవాలయం వద్ద మహా శివునికి గంజాయిని ప్రసాదంగా పెడుతున్నామంటూ కొందరు యువకులు వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. దేవుడికి అందరూ కొబ్బరికాయ కొడితే.. తాము ప్రత్యేకంగా గంజాయి పెడుతున్నామంటూ వీడియోలో వివరించారు. దీనిని ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు. ఈ వీడియో వైరల్ కావడంతో నెటిజన్లు.. నగర సీపీ సజ్జనార్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాలతో వీడియోను పరిశీలించి.. సదరు యువకులు బడంగ్‌పేట్‌కు చెందిన చరణ్‌తోపాటు అతడి స్నేహితులుగా పోలీసులు గుర్తించారు. వారిని పట్టుకునేందుకు గాలింపు చర్యలు చేపట్టారు. ఈ తరహా రీల్స్ పెట్టే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని యువకులను నగర సీపీ వీసీ సజ్జనార్ హెచ్చరించారు.

## రాష్ట్ర ముఖచిత్రాన్ని మార్చేలా బడ్జెట్

**అమరావతి:** రాష్ట్ర ముఖచిత్రాన్ని మార్చేలా ఎపి బడ్జెట్ ఉందని శాసనసభలో బడ్జెట్‌పై చర్చలో చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. ఈ బ్జడెట్ రాష్ట్ర ముఖచిత్రాన్ని మార్చేదిగా ఉందని పేర్కొన్నారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా భారీ బ్జడెట్ ప్రవేశపెట్టారని తెలిపారు. మూలధన వ్యయాన్ని భారీగా పెంచడం ద్వారా ఆస్తులు సమకూరుతాయన్నారు. రెవెన్యూ లోటును తగ్గించడం ద్వారా రాష్ట్ర భవిష్యత్తుపై నమ్మకం పెరిగిందని ఆయన అభిప్రాయపడ్డారు. వ్యవసాయ రంగంలో సాంకేతికత వినియోగాన్ని పెంచారని ఎమ్మెల్యే తెలిపారు. వ్యవసాయ అనుబంధ రంగాలకు 50 వేల కోట్లకు పైగా కేటాయించడం ద్వారా ఇది నిజమైన రైతు ప్రభుత్వమని నిరూపించారని పుల్లారావు పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టుకు 6 వేల కోట్లకు పైగా నిధులు కేటాయించారని తెలిపారు. ధరల స్థిరీకరణ నిధి ద్వారా రైతులకు గిట్టుబాటు ధర కల్పించే చర్యలు తీసుకున్నారని, రైతు నష్టపోతే రాష్ట్రం నష్టపోతుందని ఆయన అన్నారు. ఎ÷ఖసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల సంక్షేమానికి రూ.91 వేల కోట్లు కేటాయించారన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా 'తల్లికి వందనం' పథకం ద్వారా విద్యార్థికి రూ.15 వేలు అందిస్తున్నామని చెప్పారు. అత్యధిక సామాజిక భద్రత పెన్షన్లు ఇస్తున్న రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలిచిందని అన్నారు. పరిశ్రమలు, ఐటీ కంపెనీలకు ప్రోత్సాహకాలు ఇస్తున్నారని తెలిపారు. దేశంలో అత్యధిక పెట్టుబడులు సాధించిన రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని చెప్పారు. విజన్ 2047 లక్ష్యాలకు అనుగుణంగా బ్జడెట్ రూపొందించారన్నారు. అప్పుల చీకట్లో ఆశాదీపంగా వెలిగిన బ్జడెట్ ఇదని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు.

## మండలిలో డిజిటల్ అటెండెన్స్ ఎందుకు పెట్టలేదు ?

**అమరావతి:** శాసనసభలో డిజిటల్ అటెండెన్స్ వ్యవస్థను అమలు చేసిన ప్రభుత్వం, అదే విధానాన్ని శాసనమండలిలో ఎందుకు అమలు చేయడంలేదని విపక్ష నేత బొత్స సత్యనారాయణ ప్రశ్నించారు. మండలి మీడియా పాయింట్‌లో మాట్లాడుతూ ఈ అంశంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇక, దేవదేవుడి ప్రసాదంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అనవసర ఆరోపణలు చేశారని బొత్స ఆరోపించారు. పందికొవ్వు, జంతువుల కొవ్వు కలిపారని ప్రచారం చేయడం బాధాకరమన్నారు. వాస్తవాలు తేలాలని సుప్రీంకోర్టు సిట్ నియమించిందని, దర్యాప్తులో కొన్ని ఆశ్చర్యకర విషయాలు బయటకు వస్తున్నాయని చెప్పారు. ప్రజలు జీర్ణించుకోలేని నిజాలు వెలుగులోకి వస్తున్నాయని వ్యాఖ్యానించారు.కల్తీ నెయ్యి సరఫరా చేస్తున్నారనే కారణంతో ఇందాపూర్‌ను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టారని, ఇప్పుడు అదే సంస్థ రూ.680కు నెయ్యి సరఫరా చేస్తోందని తెలిపారు. ఇందాపూర్ సంస్థకు హెరిటేజ్ ఫుడ్స్ సంబంధం ఉందని, ఇవన్నీ తాము సృష్టించిన ఆరోపణలు కాదని ? సంబంధిత సంస్థలే వెల్లడించాయని అన్నారు. ఇందాపూర్‌ను అడ్డుపెట్టుకుని హెరిటేజ్ దోపిడీకి ఎ÷–లాన్ చేసిందని, దేవుడి పేరుతో రాజకీయ లబ్ది పొందాలనే ప్రయత్నం చేశారని ఆరోపించారు. సభలో ఇందాపూర్ అంశంపై చర్చకు ఎందుకు అనుమతించలేదని ప్రశ్నించారు. టాయిలెట్లలో వాడే కెమికల్స్ లడ్డూలో కలిపారని సీఎం మాట్లాడటం దురదృష్టకరమన్నారు. చంద్రబాబు అధికార దాహంతో ఏ స్థాయికైనా వెళ్తారని విమర్శించారు. ఆయన దోపిడీపై ఎంతవరకైనా పోరాడుతామని స్పష్టం చేశారు.ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌లో బిల్ గేట్స్ పేరు కేంద్రం తొలగించిందనే వార్తలపై రెండు మూడు రోజుల్లో స్పష్టత వస్తుందని, ఆ తర్వాత స్పందిస్తామని తెలిపారు. ఒకవేళ కేంద్రం ఆయన పేరును పక్కన పెట్టి ఉంటే, అదే సమయంలో ఏపీకి ఆహ్వానించడం సబబు కాదన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో ఇంటింటికీ వైద్యం అందించామని, ఈ ప్రభుత్వం ప్రజారోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. చట్టాన్ని, రాజ్యాంగాన్ని గౌరవిస్తామని, రాజ్యాంగబద్ధమైన చర్యలు తీసుకోవాలంటే తీసుకోవచ్చని పేర్కొన్నారు. మొత్తానికి, అసెంబ్లీలో అమలు చేస్తున్న డిజిటల్ అటెండెన్స్ విధానాన్ని మండలిలో కూడా అమలు చేయాలని బొత్స సత్యనారాయణ గట్టిగా డిమాండ్ చేశారు.

## సంచలనం రేపిన మదనపల్లి ఘటన

**అమరావతి:** మదనపల్లిలో జరిగిన దారుణ ఘటనపై హోంమంత్రి వంగలపూడి అనిత తీవ్రంగా స్పందించారు. ఈ ఘటన చాలా బాధాకరమని పేర్కొంటూ, బాధితురాలి కుటుంబ సభ్యులతో మాట్లాడినట్లు వెల్లడించారు. ఘటనకు సంబంధించి ముందుగా ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సోషల్ మీడియాలో తనను ట్యాగ్ చేశారని అనిత తెలిపారు. అనంతరం సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పూర్తి వివరాలు తెలుసుకున్నట్లు చెప్పారు. ప్రాథమిక విచారణలో ముద్దాయి డ్రగ్స్ లేదా గంజాయి సేవించలేదని, అయితే మితిమీరిన మద్యం సేవించినట్లు గుర్తించామని వెల్లడించారు. మొదట బాలిక అదృశ్యమై ఉండవచ్చని అనుకున్నామని, కానీ స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు విచారణ చేపట్టి బాలిక మృతదేహాన్ని ఆమె ఇంటి ఎదురుగా గుర్తించారని తెలిపారు. నిందితుడిని తమకు అప్పగించాలని స్థానికులు ఆందోళనకు దిగారని హోంమంత్రి చెప్పారు. అయితే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాల్సి ఉండటంతో, విచారణకు ఆటంకం కలగకుండా బాలిక మృతదేహాన్ని పోస్టుమార్టంకి రలించారు. అలాగే నిందితుడిని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అతడు బెయిల్‌పై బయటకు రాకుండా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని, ఇటువంటి ఘటనలపై తమ ప్రభుత్వం సీరియస్‌గా వ్యవహరిస్తోందని హోంమంత్రి అనిత పేర్కొన్నారు. కాగా, మదనపల్లిలో చిన్నారి హత్య కేసు ఉద్రిక్తతకు దారి తీసింది. చిన్నారి మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం తీసుకెళ్లేందుకు పోలీసులు చేస్తున్న ప్రయత్నాలను స్థానికులు అడ్డుకుంటూ ఆందోళనకు దిగారు. నిందితుడిని తమకు అప్పగించాలని, లేకపోతే ఎన్‌కౌంటర్ చేయాలంటూ జాతీయ రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు.. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు ఎస్పీ సహా ఇతర పోలీసు అధికారులు స్థానికులతో చర్చలు జరిపారు.. ఆందోళన కారణంగా చెన్నై?ముంబై జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. చట్టాన్ని చేతిలోకి తీసుకోకూడదని కచ్చితంగా కేసులో నిందితుడికి శిక్ష పడేలా చేస్తామంటూ ఎస్పీ విశ్వనాథ్ స్థానికులకు వివరించే ప్రయత్నం చేస్తున్న స్థానికులు ఆందోళన విరమించక పోవడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.

## అసోంలో కాంగ్రెస్‌కు బగ్ షాక్

**గౌహతి:** అస్సాం ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీకి బిగ్ షాక్ తగిలింది. అస్సాం కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు భూపెన్ బోరా రాజీనామా రాష్ట్ర రాజకీయాల్లో సంచలనంగా మారింది. ఈ పరిణామం తర్వాత అస్సాం సీఎం, బీజేపీ నేత హిమంత బిశ్వ శర్మ, బోరాను వ్యక్తిగతంగా కలువనున్నట్లు ప్రకటించారు. బోరా రాజీనామాపై హిమంత మాట్లాడుతూ.. భూపెన్ బోరా అస్సాం కాంగ్రెస్ లో అట్టడుగు స్థానం నుంచి ఎదిగిన ప్రముఖ హిందూ నేత. ఆయన ఆహ్వానం మేరకు ఈ సాయంత్రం ఆయనను కలవనున్నాను. బీజేపీలో ఆయన చేరితే అస్సాం, దేశ సేవలో మరింత బలం చేకూరుతుందని అన్నారు. అస్సాం కాంగ్రెస్ చీఫ్‌గా గౌరవ్ గొగోయ్ బాధ్యతలు తీసుకునే ముందు 2021-25 వరకు అస్సాం కాంగ్రెస్ అధ్యక్షుడిగా బోరా పనిచేశారు. ప్రస్తుతం, అస్సాం కాంగ్రెస్‌లో గొగోయ్ ఆధిపత్య ధోరణి కారణంగానే బోరా రాజీనామా చేశారనే వార్తలు వినిపిస్తున్నాయి. బోరా తన రాజీనామా లేఖను కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు పంపారు. 32 ఏళ్లగా పార్టీ కోసం పనిచేస్తున్నా, ఇప్పుడు విస్మరించారని, తనకు తగిన గౌరవం కల్పించలేదని ఆయన ఆరోపించారు. బోరా రాజీనామా ద్వారా కాంగ్రెస్‌లో సాధారణ వ్యక్తి అభివృద్ధి చెందలేదనే సందేశాన్ని పంపిందని, బోరాను బీజేపీలోకి స్వాగతిస్తున్నామని, బీజేపీలో చేరాలని నిర్ణయించుకుంటే ఆయనకు సురక్షిత స్థానం నుంచి ఎన్నికయ్యేలా చేస్తామని హిమంత చెప్పారు. సీఎం హిమంత తనను కలుస్తాననే వ్యాఖ్యలపై బోరా స్పందిస్తూ.. ఏ ముఖ్యమంత్రి అయినా తన ఇంటికి వస్తే అది తనకు గర్వకారణం అని బోరా అన్నారు. ఇదిలా ఉంటే, రాజీనామాపై పునరాలోచన చేయాలని గొగోయ్, ఎంపీ ప్రద్యుత్ బోర్డోలోయ్, దేబబ్రత సైకియాతో పాటు పలువురు కాంగ్రెస్ సీనియర్ నేతలు కోరారు.

## మొహాలిలో స్కూళ్లకు బాంబు బెదరింపులు

**మొహాలీ:** పంజాబ్ మొహాలీలోని కొన్ని స్కూళ్లకు మంగళవారం బాంబు బెదిరింపులు వచ్చాయి. వీటితోపాటు పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్‌మాన్ చికిత్స తీసుకుంటున్న ఫోర్టిస్ ఆసుపత్రికి కూడా మెయిల్ ద్వారా బాంబు బెదిరింపులు వచ్చాయి. దీంతో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ ఘటనపై మొహాలీ సీనియర్ పోలీసు అధికారి మాట్లాడుతూ..'మొహాలీలో కొన్ని స్కూళ్లతోపాటు, ఫోర్టిస్ ఆసుపత్రికి కూడా బాంబు బెదిరింపులొచ్చాయి. వెంటనే బాంబు స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టాము. బాంబు బెదిరింపులు రావడంతో.. ఫోర్టిస్ ఆసుపత్రిలో అత్యవసర సేవలు మాత్రమే కొనసాగుతున్నాయి. అత్యవసరం కానీ సేవల్ని నిలిపివేశాము. స్కూళ్లలో కూడా తనిఖీలు చేపట్టాము' అని ఆయన అన్నారు. పంజాబ్ సిఎం భగవంత్‌మాన్ ఫోర్టిస్ ఆసుపత్రిలో చికిత్స కోసం సోమవారం అడ్మిట్ అయ్యారు. సోమవారం ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయిన భగవంత్‌మాన్ కొద్ది గంటల తర్వాత ఆయాసంతో బాధపడుతూ మళ్లీ అడ్మిట్ అయ్యారు అని అధికార వర్గాలు తెలిపాయి. ఫిబ్రవరి 11న మొహాలీలో 16 ప్రైవేటు స్కూళ్లకు బాంబు బెదిరింపులు వచ్చాయి.

## జెఇఇ టాపర్స్‌కు జగన్ అభినందనలు

**అమరావతి:**జేఈఈ పరీక్షల్లో అద్భుత ఫలితాలు సాధించి టాపర్స్‌గా నిలిచిన విద్యార్థులకు వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. కఠినమైన పోటీ పరీక్ష అయిన జేఈఈలో ప్రతిభ కనబరిచి ఉన్నత ర్యాంకులు సాధించడం విద్యార్థుల ప్రతిభ, తల్లిదండ్రుల ప్రోత్సాహం, గురువుల మార్గదర్శకత్వానికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ఈ విజయం భవిష్యత్తులో మరింత ఉన్నత లక్ష్యాలను సాధించే దిశగా వారికి మార్గదర్శకంగా నిలుస్తుందని తెలిపారు. రాష్ట్రానికి కీర్తి తీసుకువచ్చిన ఈ ప్రతిభావంతులైన విద్యార్థులు భవిష్యత్తులో దేశ అభివృద్ధికి కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షిస్తూ, వారి విద్యాభ్యాసం, భవిష్యత్తు ప్రయాణం విజయవంతంగా కొనసాగాలని వైఎస్ జగన్ ఆకాంక్షించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు కూడా ప్రత్యేక అభినందనలు తెలియజేస్తూ, రాష్ట్ర యువత ఇలాగే ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

## ముంబై క్లైమెట్ వీక్ సదస్సుకు సిఎం రేవంత్

**హైదరాబాద్:** శంషాబాద్ ఎయిర్ పోర్ట్ నుంచి సిఎం రేవంత్ రెడ్డి ముంబై బయలుదేరి వెళ్లారు. మహారాష్ట్ర రాజధాని ముంబైలో మూడు రోజుల పాటు జరిగే ముంబై క్లైమెట్ వీక్ లో పాల్గొంటారు. మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ ప్రత్యేక ఆహ్వానం మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముంబై కార్యక్రమానికి హాజరవుతున్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, హైదరాబాద్ విస్తృత ప్రగతి, పరిపాలన సంబంధిత అంశాల్లో రాష్ట్ర విజయాలను ఈ వేదికపై వివరించనున్నారు. ఫిబ్రవరి 17 నుండి 19 వరకు మూడు రోజుల పాటు ముంబై క్లైమెట్ వీక్ జరుగనుంది. ఈ అంతర్జాతీయ సదస్సు బాంద్రా కుర్లా కాంప్లెక్స్‌లోని జియో కన్వెన్షన్ సెంటర్ లో జరుగనుంది. మహారాష్ట్ర ప్రభుత్వం, ముంబై కార్పొరేషన్ భాగస్వాములుగా సదస్సు జరుగనుండగా ప్రధాని నరేంద్ర మోడీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు.

## మరో మూడు మున్సిపల్ ఛైర్మన్ల ఎంపిక వాయిదా

**హైదరాబాద్:** తెలంగాణలో మున్సిపాలిటీ ఛైర్మన్ల ఎన్నిక కొనసాగుతోంది. సోమవారం 105 మున్సిపాలిటీలకు ఛైర్మన్ల ఎన్నిక పూర్తి కాగా.. మిగిలిన 11 మున్సిపాలిటీ ఛైర్మన్ల ఎన్నికలు ఇవాళ నిర్వహించారు. అయితే, వివిధ కారణాల వల్ల మూడు మున్సిపాలిటీల్లో ఎన్నిక మళ్లీ వాయిదా పడింది. ఇబ్రహీంపట్నం, క్యాతన్‌పల్లి, ఖానాపూర్ మున్సిపాలిటీల్లో ఎన్నికలు వాయిదా వేస్తున్నట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. ఇబ్రహీంపట్నంలో బీఆర్ఎస్ అభ్యర్థి సుదర్శన్‌రెడ్డి మున్సిపల్ ఛైర్మన్‌గా ఎన్నికయ్యారు. అయితే, హైకోర్టు ఈ ఎన్నికపై స్టే విధించడంతో ఆయనకు అధికారులు ధ్రువీకరణ పత్రం ఇవ్వలేదు.

## హారిక డ్రగ్స్ పరిశ్రమలో పేలిన రియాక్టర్

**సంగారెడ్డి:** జిల్లాలోని గుమ్మడల మండలం హారిక డ్రగ్స్ పరిశ్రమలో రియాక్టర్ పేలింది. గుమ్మిడదల కేంద్రంలోని హారిక డ్రగ్స్ పరిశ్రమలో మంగళవారం రాత్రి రియాక్టర్ పేలింది. పేలుడు తీవ్రతతో పక్కనే ఉన్న ప్రహరీ గోడ కూలింది. ఘటన సమయంలో పరిశ్రమలో కార్మికులు విధుల్లో ఉన్నట్టు సమాచారం. పేలుడు శబ్దంతో పరిసర ప్రాంతాల్లో భయాందోళన వాతావరణం కనిపిస్తోంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. గాయాల వివరాలపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. పేలుడు కారణాలపై అధికారులు దర్యాప్తు చేపట్టారు.

## కోవూరు సమస్యలు పరిష్కరించండి

**అమరావతి:** కోవూరు నియోజకవర్గంలోని పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు తోడ్పాటు అందించాలని, ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి.. సీఎం చంద్రబాబును కోరారు. మంగళవారం అమరావతిలోని సీఎం కార్యాలయంలో వారు సీఎం చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. రైతుల ప్రయోజనాల దృష్ట్యా కనిగిరి రిజర్వాయర్ పనులను త్వరితగతిన చేపట్టాలని సీఎంను కోరారు. ముదివర్తి – ముదివర్తి పాలెం వరకు కాజ్ వే నిర్మాణ పనులను వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. గంగపట్నం, పల్లిపాలెం గ్రామంలో ఉప్పుటేరు వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని విన్నవించారు. బుచ్చిరెడ్డిపాలెం ÷ర్ స్టేషన్‌కు కావాల్సిన అదనపు సిబ్బందిని నియమించాలని సీఎంను కోరారు.

## వేసవి నీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు: కలెక్టర్

**గుంటూరు:** వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి ముందస్తు ఏర్పాట్లు చేయాలని అన్నారు. అవసరమైన చోట్ల ట్యాంకర్లను సిద్ధం చేయాలన్నారు. మంగళవారం గుంటూరులోని కలెక్టరేట్‌లో నీరు, పారిశుద్ధ్య కమిటీ సమావేశం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను నింపుకోవాలన్నారు. నీటివనరులను సిద్ధం చేసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా పరిషత్ సీఈవో జ్యోతిబసు, జిల్లా గ్రామీణ నీటి సరఫరా విభాగం ఎస్‌ఈ కల్యాణ్ చక్రవర్తి, జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారి ప్రసూన తదితరులు పాల్గొన్నారు.


## స్విమ్మింగ్ పూల్‌లో పడి వైద్యవిద్యార్థి మృతి

**అనంతపురం:** స్విమ్మింగ్ పూల్‌లో పడి వైద్యవిద్యార్థి మృతి చెందిన ఘటన అనంతపురం జిల్లా గార్లదిన్నెలో చోటుచేసుకుంది. అనంతపురం మెడికల్ కాలేజీలో చదువుతున్న ఐదుగురు విద్యార్థులు ఈత కొట్టడానికి మంగళవారం గార్లదిన్నెలోని ఓ స్విమ్మింగ్ పూల్‌కు వెళ్లారు. మోహన్ (20) అనే విద్యార్థి ప్రమాదవశాత్తు స్విమ్మింగ్ పూల్‌లో లోతు ఎక్కువగా ఉన్నచోట మునిగి ప్రాణాలు కోల్పోయాడు. మృతుడిని ప్రకాశం జిల్లా మార్కాపురానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

## బిఆర్ఎస్ ఖాతాలో ఇంద్రేశం

**సంగారెడ్డి:** జిల్లాలోని ఇంద్రేశం మున్సిపాలిటీని బీఆర్ఎస్ కైవసం చేసుకుంది. మున్సిపల్ చైర్మన్‌గా కిషంగుల ప్రమీల, వైస్ చైర్మన్‌గా పటోళ్ల హరీశ్ రెడ్డి ఎన్నికయ్యారు. ఇంద్రేశం పురపాలికలో మొత్తం 18 వార్డులకుగాను అత్యధికంగా 9 వార్డులను బీఆర్ఎస్ గెలుచుకోగా, ఆరు వార్డులు కాంగ్రెస్, రెండు వార్డులు బీజేపీ, ఒకటి ఇండిపెండెంట్ అభ్యర్థి గెలుపొందారు. కానీ, నిన్న జరగాల్సిన చైర్మన్ ఎన్నికను వాయిదా వేశారు. ఇవాళ ఎన్నిక నిర్వహించగా మున్సిపల్ పీఠాన్ని బీఆర్ఎస్ కైవసం చేసుకుంది.

# వన్యప్రాణులను కాపాడుకుందాం




ఇటీవల పెద్దపులుల జనావాసాల్లోకి వచ్చి హడలెత్తించాయి. అడపాదడపా చిరుతలు వస్తూనే ఉన్నాయి. అక్కడక్కడా ఎలుగుబంట్లు దాడి చేస్తున్నాయి. కొన్ని జిల్లాల్లో అడవిపందులు, జింకలు పంటలపై దాడులు చేస్తున్నాయి. ఏనుగులు కూడా పంటలను ధ్వంసం చేస్తున్నాయి. ఇకపోతే కోతుల దాడికి హద్దే లేకుండా పోయింది. ఇలా ఇవన్నీ జనావాసాల్లో ఎందుకు వస్తున్నాయో జనాలు ఆలోచించడంలేదు. ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. ఇవన్నీ ఇలా జనావాసాల మీద పడడానికి కారణం మనమే. అడవులను, కొండలను ధ్వంసం చేసిన పాపానికి భయాన్ని అనుభవిస్తున్నాం. ఇప్పటికీ ఈ విధ్వంసం ఆగడం లేదు. ఆపాలన్న ఆలోచన రావడం లేదు. మనమే ప్రకృతిని ఇలా విధ్వంసం చేస్తూ పోతే ఇకముందు తరాలు ఇంతకు మించి దారుణాలు ఎదుర్కోక తప్పదు. వానరాలు ఊళ్లమీద పడి విధ్వంసం సృష్టిస్తున్నాయి. ప్రకృతి ఒడిలో ప్రశాంతంగా సంచరించే పులులు, చిరుతలు, ఏనుగులు, ఎలుగుబంట్లు వంటి వన్యమృగాలు ఇవాళ మన గడప వరకూ వచ్చేస్తున్నాయి. వన్య ప్రాణులు అడవి దాటి, జనారణ్యంలోకి రావడానికి ప్రధాన కారణం? మనం అడవిగా భావిస్తున్న ప్రాంతంలో అవి జీవించలేకపోవడం. వాటికి కావాల్సిన ఆహారం, నీరు సమృద్ధిగా వుంటే, అవి బిక్కుబిక్కుమంటూ రోడ్ల మీదకు రావు. మనిషిలోని నాగరిక లాభాపేక్ష వృక్ష, జంతు, పక్షి జాతుల క్షీణతకు దారితీస్తోంది. పర్యావరణ పరిరక్షణలో అడవుల పాత్ర కీలకం. కానీ, భారతదేశంలో జనాభా విస్ఫోటనం వల్ల వ్యవసాయాభివృద్ధి, పారిశ్రామికీకరణ, నగరీకరణ, భారీ నీటిపారుదల ప్రాజెక్టులు, జలవిద్యుత్ ప్రాజెక్టుల నిర్మాణం, రోడ్లు, రైలు మార్గాల అభివృద్ధి వంటి కార్యకలాపాలతో అడవుల విస్తీర్ణం క్రమంగా తగ్గుతోంది. ఫలితంగా పర్యావరణ సమతుల్యత లోపిస్తోంది. వన్య మృగాలను చూసినప్పుడు, వాటిని హింసించకుండా అధికారులకు తెలియజేసే ప్రయత్నాలు రావాలి. గ్రామాల్లో చైతన్య కార్యక్రమాలు నడపాలి. సంబంధిత ప్రభుత్వ శాఖలు సరైన సమయంలో సరైన చర్యలు తీసుకోవడం, ప్రజలు ఆత్మరక్షణ చేసుకుంటూనే, హింసకు దూరంగా ఉండి అధికారులకు సమాచారం అందించడం అత్యవసరం. కేరళలో 'వన్యమృగ బీటర్లు' వంటి స్వచ్ఛంద సంఘాలు వన్య మృగాలను పట్టి, అడవుల్లో విడిచిపెడతారు. అలాగే, సోలార్ ఫెన్సింగ్, బయోఫెన్సింగ్ వాడుతారు. వన్యప్రాణులను మన 'అతిథులు'గా చూడాలి. వాటిని తిరిగి అడవిలోకి పంపేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలి. అదే సమయంలో అడవుల పునరుద్ధరణకు పూనుకోవాలి. చిన్నా, పెద్ద తేడా లేకుండా పర్యావరణం పట్ల అవగాహన కలిగించాలి. మనిషిని, వన్యమృగాన్ని రక్షించే ఏకైక మార్గం? అడవులను, పర్యావరణాన్ని కాపాడుకోవడం అన్న సంగతి గుర్తించాలి. అడవులను నరికివేయడం,ఖనిజాల వెలికితీత పేరుతో కొండలను ధ్వంసం చేయడం వల్ల జరుగుతున్న దుష్పరిణామం ఇది. సహజవనరులను దోచుకోవడానికి అటవీ భూములను కట్టబెట్టడం, అభివృద్ధి పేరుతో ప్రకృతి సిద్ధమైన సహజ ఆవాసాలను, టూరిజం పేరుతో కొండలు, గుట్టలను ఛిద్రం చేయడం వంటి దుశ్చర్యల ఫలితమే ఈ ఫలితం అని గుర్తించాలి. ఇటీవల కాలంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటకల్లోని అటవీ పరిసర ప్రాంతాల్లో ఇలాంటి సంఘటనలు తరచూ చోటుచేసుకుంటున్నాయి. ఇది కేవలం వన్యమృగాల దూకుడు మాత్రమే కాదు, మనిషి దుందుడుకు చర్యలకు ప్రతిస్పందన కూడా! అ వన్యప్రాణుల వలసకు మూల కారణం మానవాభివృద్ధి తెచ్చిన దురాశ. దేశంలో 1951లో 40.4 శాతం అటవీప్రాంతం ఉండగా, ఇప్పుడది 21.7 శాతానికి తగ్గినట్లు ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. ఫాస్ట్ ట్రాక్ ప్రాజెక్టులు, మైనింగ్, రోడ్లు, రియల్ ఎస్టేట్‌లు సహజ అడవులను మింగేస్తున్నాయి. దాదాపు 70 శాతం మంది భారతీయులు అడవులకు సమీపంలోనే నివసిస్తున్నారు. మనిషి- వన్యప్రాణుల సంఘర్షణ వల్ల ప్రతి సంవత్సరం 500 మందికి పైగా మరణిస్తున్నారని ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. ఇది వందలాది వన్యమగాల మరణాలకూ కారణమౌతోంది. 'భూమి మనందరి ఆస్తి కాదు'. కానీ మనం అడవులను సొంత 'ఆస్తి'గా భావిస్తూ విధ్వంసానికి పాల్పడుతుండటం వల్లే ప్రకృతి తిరుగుబాటు చేస్తోంది. ఇటీవల తెలంగాణ,తూర్పుగోదావరి జిల్లా ప్రజలకు కొన్ని రోజుల పాటు కంటిమీద కునుకు లేకుండా చేసిందో పెద్దపులి. ఎట్టకేలకు అటవీశాఖ సిబ్బంది దానికి మత్తు ఇంక్షన్ ఇచ్చి పట్టుకున్నారు. తెలంగాణలోని జనగామ, సిద్ధిపేట జిల్లాల పరిధిలోనూ పెద్దపులి సంచారం కలకలం రేపింది. ఇళ్లలోకి, పంట పొలాల్లోకి పులి తదితర జంతుజాలం వచ్చేస్తున్నాయి. ఏనుగులు సైతం పంట పొలాల్లోకి వచ్చి ధ్వంసం చేస్తున్న ఘటనలు తరచూ చోటుచేసుకుంటున్నాయి. నెమళ్లు వంటి అరుదైన పక్షులకూ భద్రత లేకుండాపోయింది. ఇది సహజ పర్యావరణ వ్యవస్థలను భంగపరచడంతో పాటు, జీవవైవిధ్యాన్ని నిర్వీర్యం చేస్తోంది. ఒక చెట్టు పడిపోతే పది చెట్లను నాటడం అలవాటు చేయాలి. ఇప్పుడు దేశానికి కావాల్సింది అటవీ సంరక్షణ, ప్రకృతి విధ్వంసం ఆపడం. అడవుల నరికివేతను అరికట్టాలన్న దృఢనిర్ణయం, మానవుల నుంచి రక్షణ కల్పించడం అన్నది ఉద్యమంగా సాగాలి. ప్రకృతి మనకు ఇచ్చిన బహుమతి అడవి. మనం దాన్ని కాపాడుకోవడం ద్వారా మనలను మనం రక్షించుకోవాలి. ప్రకృతిపై మనిషికి అధికారం లేదు. బాధ్యత మాత్రమే వుంది అన్న విషయాన్ని గుర్తించాలి. అప్పుడే వన్యప్రాణులకు రక్షణ ఉంటుంది.

# క్యాతన్‌పల్లిలో స్వల్ప ఉద్రిక్తత

### బిఆర్ఎస్, కాంగ్రెస్ బాహాబాహీ

### పోలీసుల లాఠీఛార్జ్... పలువురికిాయాలు

**మంచిర్యాల:** మంచిర్యాల జిల్లా క్యాతనపల్లిలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలో ఉద్రిక్తత నెలకొంది. క్యాతనపల్లి మున్సిపల్ కార్యాలయానికి బీఆర్ఎస్, సీపీఐ అభ్యర్థులు భారీ బందోబస్తుతో చేరుకున్నారు. ఎంపీ వంశీకృష్ణ, మంత్రి వివేక్ వెంకటస్వామితో కలిసి కాంగ్రెస్ అభ్య ర్థులు వచ్చారు. ఈ క్రమంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య వాగ్వా దం జరిగింది. అది కాస్త ముదర డంతో ఇరువర్గాలు ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు లాఠీ చార్జి చేసి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ఘటనలో పలువురు స్వల్పంగా గాయపడ్డారు. వారిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. క్యాతనపల్లి మున్సిపల్ కార్యాలయానికి బిఆర్ఎస్, సిపిఐ అభ్యర్థులు పెద్ద ఎత్తున చేరుకున్నారు. ఎంపి వంశీకృష్ణ, మంత్రి వివేక్ వెంకటస్వామితో కలిసి కాంగ్రెస్ అభ్యర్థులు వచ్చారు. ఈ క్రమంలో బిఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య వాగ్వాదం జరిగింది. ఘర్షణ రాజుకొని ఇరువర్గాలు ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు లాఠీ చార్జి చేసి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ఘటనలో పలువురు స్వల్పంగా గాయపడ్డారు. వారిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. బిఆర్ఎస్ కౌన్సిలర్లను చైర్మన్ ఎన్నికలో పాల్గొననివ్వకుండా పోలీసులు అక్రమ కేసులు పెట్టి అడ్డుకున్నారు. చైర్మన్, వైఎస్ చైర్మన్ ఎన్నికలో పాల్గొనేందుకు వెళుతున్న క్యాతనపల్లి మున్సిపాలిటీ 21వ వార్డు బిఆర్ఎస్ కౌన్సిలర్ స్వర్ణలతను మంగళవారం పోలీసులు అడ్డుకున్నారు. ఆమెపై కేసు నమోదైందని ఆమెను అదుపులోకి తీసుకున్నారు. దీనిపై ఎమ్మెల్యే కోవా లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ మండిపడ్డారు. దీంతో బాల్క సుమన్ మీద కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు రాళ్ల దాడికి దిగారు. కాంగ్రెస్ దాడిని బిఆర్ఎస్ నాయకులు ప్రతిఘటించారు. ఈ క్రమంలో రంగంలోకి దిగిన పోలీసులు లాఠీ చార్జి చేసి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ఘటనలో పలువురు స్వల్పంగా గాయపడ్డారు. వారిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మరోవైపు పోలీసులు, అధికారులను అడ్డం పెట్టుకుని మరోసారి కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ పీఠం దక్కించుకునేందుకు కుట్రలు పన్నిందని బిఆర్ఎస్ నేతలు ఆరోపించారు.

## ప్రత్యూష కేసులో సిద్దార్థరెడ్డికి చుక్కెదురు

**న్యూఢిల్లీ:** సినీ నటి ప్రత్యూష మృతి కేసులో నిందితుడు సిద్దార్థ రెడ్డికి సుప్రీం కోర్టులో చుక్కెదురైంది. నాలుగు వారాల్లో పోలీసుల ఎదుట లొంగిపోవాలని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. హైకోర్టు విధించిన రెండేళ్ల శిక్షను సుప్రీం ధర్మాసనం సమర్థించింది. పోస్టుమార్టంను అన్ ప్రొఫెషనల్‌గా నిర్వహించారని ఉన్నతన్యాయస్థానం వ్యాఖ్యానించింది. కాగా, 2002 ఫిబ్రవరి 23న నటి ప్రత్యూష, ఆమె ప్రియుడు సిద్దార్థ రెడ్డి కలిసి పురుగుల మందు కలిపిన కూల్ డ్రింక్ తాగడం తీవ్ర కలకలం సృష్టించిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో ప్రత్యూష మరుసటి రోజు మరణించగా.. సిద్దార్థ రెడ్డి చికిత్స తర్వాత కోలుకున్నాడు. ఇది ఆత్మహత్యాయత్నమా లేక ఆత్మహత్యకు ప్రేరేపించడమా అనే దానిపై వివాదం చెలరేగింది. ఇది హత్యే అని ప్రత్యూష తల్లి సరోజినీ దేవి ఆరోపించారు. సీబీఐ దర్యాప్తు తర్వాత సిద్దార్థ రెడ్డిపై సెక్షన్ 306 కింద కేసు నమోదు అయ్యింది. ఈ క్రమంలో 2004లో సిద్దార్థ రెడ్డికి సెషన్స్ కోర్టు ఐదేళ్ల జైలు శిక్ష విధించింది. 2011లో హైకోర్టు.. ఈ శిక్షను రెండేళ్లకు తగ్గించి, రూ.50,000 జరిమానా విధించింది. ఈ తీర్పుపై సిద్దార్థ రెడ్డి, ప్రత్యూష తల్లి ఇద్దరూ 2012లో సుప్రీం కోర్టులో అప్పీల్ చేశారు. హైకోర్టు విధించిన జైలుశిక్షను సవాలు చేస్తూ నిందితుడు సిద్దార్థరెడ్డి, అతడికి శిక్ష పెంచాలంటూ నటి ప్రత్యూష తల్లి సరోజిని సుప్రీం కోర్టును ఆశ్రయించారు. 2025 నవంబర్‌లో వాదనలు విన్న సుప్రీంకోర్టు.. తీర్పును రిజర్వ్ చేసింది. తాజాగా ఈ కేసుకు సంబంధించి సుప్రీం కోర్టు తుది తీర్పు ఇచ్చింది. సిద్దార్థ రెడ్డి పిటిషన్‌ను తిరస్కరించిన సుప్రీం ధర్మాసనం.. హైకోర్టు శిక్షను సమర్థించింది.

## జగన్ అక్రమాస్తుల కేసు

### ఐఎఎస్ శ్రీలక్ష్మికి దక్కని ఊరట

**న్యూఢిల్లీ:** వైసిపి అధినేత వైఎస్.జగన్ అక్రమస్తుల కేసులో ఐఏఎస్ అధికారిణి శ్రీలక్ష్మికి సుప్రీం కోర్టులో చుక్కెదురైంది. జగన్ అక్రమాస్తుల కేసులో తన పేరును తొలగించాలని కోర్టులో దాఖలు చేసిన డిశ్చార్జ్ పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేసింది. హైకోర్టు తీర్పును సమర్ధిస్తూ సుప్రీం కోర్టు ఈ పిటిషన్ రిజెక్ట్ చేసింది. ఓబులాపురం గనుల కేసులో నిబంధనలకు అనుగుణంగా వెళ్లానని ఐఎఎస్ శ్రీలక్ష్మి సుప్రీం కోర్టులో పిటిషన్ వేశారు. అయితే శ్రీలక్ష్మి నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడ్డారని, ఆమె మరిది భారీగా అక్రమాస్తులు సంపాదించారని ధర్మాసనానికి సిబిఐ వెల్లడించింది. ఆమె లంచం కూడా డిమాండ్ చేసినట్టు సాక్ష్యాలు వాంగ్మూలం ఇచ్చారని సుప్రీం ధర్మాసనానికి సిబిఐ అధికారులు తెలిపారు. విచారణ అనంతరం శ్రీలక్ష్మి దాఖలు చేసిన డిశ్చార్జ్ పిటిషన్‌ను కోర్టు కొట్టివేసింది.

# గంజాయి అదుపునకు కఠిన చర్యలు

**అమరావతి:** ఏపీ అసెంబ్లీ సమావేశాలు రెండ్రోజుల విరామం అనంతరం మంగళవారం నాలుగవ రోజు ప్రారంభమయ్యాయి. శాసనసభ మొదలైన వెంటనే డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు ప్రశ్నోత్తరాలను చేపట్టారు. ఆంధ్రా ఒడిస్సా సరిహద్దులో గంజాయి నియంత్రణపై పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ప్రశ్న లేవనెత్తారు. హోం మంత్రి వంగలపూడి అనిత సమాధానమిస్తూ... ప్రస్తుతం రాష్ట్రంలో గంజాయి నియంత్రణలో ఉందని, కూటమి ప్రభుత్వం రాగానే గంజాయిపై ఉక్కిపాదం మోపినట్లు తెలిపారు. వైసీపీ హయాంలో రాష్ట్రం గంజాయి కేంద్రంగా మారిందని విమర్శించారు. గత ప్రభుత్వంలో నియంత్రణ లేకుండా పోయిందని హోంమంతి ఆరోపించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే గంజాయి రవాణా, సాగుపై కఠిన చర్యలు చేపట్టిందని వివరించారు. ఈగల్ విభాగాన్ని ఏర్పాటు చేసి గంజాయి రవాణాకు అడ్డుకట్ట వేసినట్లు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 35 చెక్ పోస్టులను ఏర్పాటు చేసి గంజాయి రవాణాను అరికట్టామని తెలిపారు. గంజాయి సాగు, రవాణాపై నిరంతర నిఘా పెట్టామన్నారు. 47 ప్రాంతాల్లో డ్రోన్‌ల ద్వారా నిఘా చేసి, అక్రమ సాగును గుర్తించి ధ్వంసం చేస్తున్నామని వివరించారు. గంజాయి తరలించే వారిపై 1,400కు పైగా కేసులు నమోదు చేశామని మంత్రి తెలిపారు. గంజాయి వల్ల కలిగే దుష్ఫలితాలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. పొరుగు రాష్ట్రాల పోలీసు యంత్రాంగంతో సమన్వయం చేసుకుంటున్నామని హోం మంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. ఇకపోతే అసెంబ్లీ ఆడియో సమస్య కారణంగా సమావేశాలు గంట ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. బడ్జెట్ రోజు సమస్య తలెత్తడంతో ఆ రోజు సరి చేశారు అధికారులు. అయితే, మళ్ళీ అదే సమస్య తలెత్తడంతో అసెంబ్లీ సాంకేతిక సిబ్బంది సరి చేసే ప్రయత్నం చేశారు. గంట సమయం పడుతుందని స్పీకర్ కార్యాలయానికి సిబ్బంది తెలియజేశారు. దీంతో సభను గంట పాటు వాయిదా వేస్తున్నట్టు డిప్యూటీ స్పీకర్ ప్రకటించారు.

# వరంగల్ జిల్లాలో కాంగ్రెస్ క్లీన్‌స్వీప్

### పది మున్సిపాలిటీల్లో హస్తం హవా

### అన్నింటా కాంగ్రెస్ ఛైర్మన్ల ఎన్నిక

**వరంగల్:** ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మొత్తం 12 మున్సిపాలిటీలను కాంగ్రెస్ పార్టీ క్లీన్ స్వీప్ చేసింది. ఆ జాబితాలోని 10 మున్సిపాలిటీలలో ఆ పార్టీకి స్పష్టమైన మెజారిటీ వచ్చింది. ఇక హంగ్ ఏర్పడిన తొర్రూర్, జనగామ మున్సిపాలిటీలు లక్కీ డ్రా ద్వారా చైర్మన్ పదవులను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది. తొర్రూరు, జనగామలో సోమవారం పరస్పర విమర్శలు, ఆరోపణల మధ్య ఉద్రిక్తత నెలకొంది. అయితే అనూహ్యంగా ఇక్కడ ఎన్నికను వాయిదా వేశారు. దీంతో మంగళవారం తిరిగి ఎన్నికల నిర్వహించారు. జనగామ మున్సిపాలిటీ చైర్ పర్సన్‌గా బాలామణి (కాంగ్రెస్), వైస్ చైర్మన్: పర్వతాలు (బీఆర్ఎస్) ఎన్నికయ్యారు. తొర్రూరు మున్సిపాలిటీ చైర్మన్: తూనం శ్రవణ్ (కాంగ్రెస్)వైస్ చైర్ పర్సన్: రజిని ఎన్నికయ్యారు. డోర్నకల్ మున్సిపాలిటీ చైర్ పర్సన్: కుండేటి రాజకుమారి వైస్ చైర్మన్: లావణ్య ఎన్నికయ్యారు. భూపాలపల్లి మున్సిపాలిటీ చైర్మన్: బుర్ర కొమురయ్య వైస్ చైర్మన్: శ్రీనివాస్ ఎంపికయ్యారు. ఇదిలావుంటే తొర్రూరు మున్సిపాలిటీ పీఠం బీఆర్ఎస్‌కు దక్కకుండా ఉండాలని కాంగ్రెస్ నీచ రాజకీయాలకు పాల్పడిందని మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. మున్సిపల్ చైర్మన్ ఎన్నిక సందర్భంగా మహబూబాబాద్ జిల్లా తొర్రూరులో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. దీంతో చైర్మన్ ఎన్నికను మంగళవారానికి వాయిదా వేశారు. ఈ నేపథ్యంలో మున్సిపల్ చైర్మన్ పీఠం దక్కించు కునేందుకు కాంగ్రెస్ కుట్రలు పన్నిందన్నారు. ఈ క్రమంలోనే మున్సిపల్ చైర్మన్ ఎన్నికకు వెళ్లకుండా ఇంచార్జిలు మధుసూదనాచారి, సత్యవతి రాథోడ్‌ను పోలీసులు అడ్డుకున్నారు. తొర్రూరు వెళ్లకుండా మహబూబాబాద్‌ములోనే సత్యవతి రాథోడ్‌ను హౌస్ అరెస్టు చేశారు. ఇక మధుసూదనచారిని హన్మకొండ శాంతినికేతన్ అపార్ట్‌మెంట్‌లో సుబేదారి పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. మున్సిపల్ చైర్మన్ ఎన్నిక సందర్భంగా సోమవారం నాడు ఉద్రిక్త వాతావరణం నెలకొన్న సంగతి తెలిసిందే. నిన్న ఉద యం 10 గంటలకు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తొమ్మిది మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లతో కలిసి తొర్రూరుకు చేరుకున్నారు. అయితే, అన్నారం రోడ్డు వద్ద ఆయనను పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేయగా, బీఆర్ఎస్ కార్యకర్తలు అభ్యంతరం తెలుపడంతో కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. మరోవైపు ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి, ఆమె అత్త ఝాన్సీరెడ్డి మున్సిపల్ కార్యాలయంలోకి వెళ్లేందుకు ప్రయత్నించగా బీఆర్ఎస్ కార్యకర్తలు నిరసనకు దిగారు. మాజీ మంత్రి దయాకర్‌రావును అడ్డుకోవడమేంటని ఆగ్రహం వ్యక్తంచేశారు. వరంగల్ ఎంపీ కడియం కావ్య తొర్రూరు మున్సిపాలిటీ కార్యాలయానికి చేరుకునే క్రమంలో బీఆర్ఎస్ శ్రేణులు అడ్డుకున్నాయి. ఒకే ఓటును రెండుచోట్ల వినియోగించొద్దని అంటూ ఖమ్మం -వరంగల్ జాతీయ రహదారిపై కారుకు అడ్డంగా బైఠాయించారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో తొర్రూరు డీఎస్పీ కృష్ణకిశోర్ లాఠీచార్జ్ చేసి కార్యకర్తలను చెదరగొట్టి, ఎంపీని అనుమతించారు. మున్సిపల్ కార్యాలయం వద్ద కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తల మధ్య తోపులాట జరిగింది. ఈ క్రమంలో దయాకర్‌రావు పీఏ భాసర్‌పై కాంగ్రెస్ కార్యకర్తలు దురుసుగా ప్రవర్తించి దాడికి పాల్పడ్డారు. పోలీసులు వెంటనే జోక్యం చేసుకొని ఆయనను రక్షించారు. విషయం తెలుసుకున్న దయాకర్‌రావు మున్సిపల్ కార్యాలయం సమీపంలో నిరసనకు దిగారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ.. తన 45 ఏండ్ల రాజకీయ జీవితంలో ఇంత నీచమైన రాజకీయాలు ఎప్పుడూ చూడలేదని చెప్పారు. కాంగ్రెస్ కార్యకర్తలు దాడులకు పాల్పడుతున్నా పోలీసులు తగిన చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారని ఆరోపించారు.

# అ'భద్రతా' సదస్సు!

అమెరికా, యూరప్ దేశాలు భిన్న ధ్రువాలని మరోసారి రుజువైంది. భూగోళం ఎదుర్కొంటున్న అతి పెద్ద సమస్యలపై ఆ రెండు పక్షాల అధినేతలూ పరస్పరం అభిప్రాయాలు పంచుకునే వార్షిక మ్యూనిక్ భద్రతా సదస్సు (ఎస్‌సీఓ) మరోసారి దీన్ని చాటింది. ఏడాదిగా అవకాశం దొరికినప్పుడల్లా యూరప్ దేశాలను అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఏకిపారేస్తున్నారు. అయినా తిరిగి జవాబివ్వలేని నిస్సహాయత వాటిని ఆవరించింది. మేల్కొనాల్సిన సమయం ఆసన్నమైందంటూ ఈ సదస్సుకు ముందు ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమానియేల్ మెక్రాన్ పిలుపునిచ్చారు. జర్మనీ చాన్సలర్ ఫ్రెడరిక్ మెర్జ్ యూరప్ రాజ్యాలు స్వతంత్ర పంథాను ఎంపిక చేసుకోవాల్సిన అవసరం ఉన్నదని చెప్పారు. నిరుడు జరిగిన సదస్సుకు హాజరైన అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ 'మీరు పాటిస్తున్న విలువలేమిటి... స్వేచ్ఛాయుత గళాలను అణిచేస్తారా?' అంటూ నిప్పులు చెరిగినప్పుడు సదస్సులోని యూరప్ దేశాల అధినేతలు నిర్ఘాంతపోయారు. సమాజ సామరస్యతకు భంగం కలిగిస్తున్న అతి మితవాద పక్షాలను యూరప్ దేశాలు అదుపు చేస్తుండటం వాన్స్‌కు నచ్చలేదు. అలాగే తమ మాదిరే యూరప్ దేశాలు కూడా వలస నిబంధనలు కఠినం చేయాలన్నది ఆయన ఉద్దేశం. ఈసారి సదస్సుకు అమెరికా ప్రతి నిధిగా వచ్చిన విదేశాంగ మంత్రి మార్కో రుబియో... వాన్స్ మాదిరి గద్దిస్తూ మాట్లాడక పోయినా అవే అభిప్రాయాలను ప్రకటించారు. 'మీతో మాకు గాఢమైన అనుబంధం ఉంది. మన ఇద్దరి భవితవ్యాలూ పెనవేసుకుని ఉన్నాయి. అవి కొనసాగాలనే మా ఆకాంక్ష కూడా! కానీ అవసరమైతే ఒంటరి ప్రయాణానికి మేం సిద్ధం' అంటూ మెత్తగా హెచ్చరించారు. ఒకప్పుడు మ్యూనిక్ భద్రతా సదస్సు అంటే అమెరికా డాబూ దర్పం ప్రదర్శించే సందర్భం. స్వేచ్ఛాయుత ప్రపంచాధినేతగా అమెరికా అధ్యక్షుడికి నీరాజనాలు పట్టే వారు. పెద్దన్నగా భావించి సలహాలూ, సూచనలూ స్వీకరించేవారు. తొలి సదస్సు నాటి నుంచీ ఇదే స్థితి. కానీ ట్రంప్ ఆగమనంతో అంతా తలకిందులైంది. ఈ సదస్సులకు అమెరికా ప్రతినిధుల సభలోని పాలక, విపక్ష సభ్యులు కూడా హాజరవుతారు. తాము అధికారంలోకొస్తే విదేశాంగ విధానంలో చేసే మార్పులేమిటో విపక్ష ప్రతినిధులు ఏకరవు పెడతారు. వీరిలో ముమ్ముందు అమెరికా అధ్యక్ష పదవికి పోటీపడదల్చుకున్నవారే అధికంగా వస్తారు. ఈసారి కూడా ఇరుపక్షాల సెనెటర్లూ వచ్చారు. కానీ వామపక్ష భావా లున్న డెమాక్రటిక్ పార్టీ సెనెటర్ ఒకాసియో కోర్టెజ్ తప్ప ఇతరులెవరూ ట్రంప్ ప్రవచిస్తున్న విధానాలను నిర్ద్వంద్వంగా వ్యతిరేకించలేకపోయారు. డెమాక్రాట్ల అయోమయానికి కారణం ఉంది. 2016లో తొలిసారి ట్రంప్ ఎన్నికై నప్పుడు అది యాదృచ్ఛిక ఘటనగా ఆ పార్టీ భావించింది. యూరప్ అధినేతల అంచనా కూడా అదే! కానీ రెండో దఫా ఎన్నిక వారిలో జ్ఞానోదయాన్ని కలిగించింది. అందుకే ఇది మొత్తంగా అమెరికన్ సమాజ ధోరణిలో వచ్చిన మార్పునకు సంకేతం కావొచ్చన్న నిర్ణయాని కొచ్చారు. ట్రంప్ అనంతరం ఎవరు అధికారంలోకొచ్చినా కొంత హెచ్చు తగ్గులతో ఈ విధానాలే తప్పక పోవచ్చని డెమాక్రాట్లు భావిస్తున్నారు. ట్రంప్ కారణంగా విచ్ఛిన్నమైన అమెరికా–యూరప్ బంధాన్ని ఏదో మేరకు మరమ్మతు చేయగలిగినా పూర్వపు స్థితి రావటానికి కొన్ని తరాలు పడుతుందని అరిజోనా సెనెటర్ మార్క్ కెల్లీ వ్యాఖ్యానించటంలోని అంతరార్థం అదే. ఈసారి భద్రత మాట అటుంచి... మ్యూనిక్ సదస్సు యూరప్ దేశాల అరణ్య రోదనగా మిగిలింది. ఉక్రెయిన్ యుద్ధంపై నిర్వహించిన చర్చకు రుబియో గైర్హాజరయ్యారు. ఆ దేశానికి అమెరికా నుంచి అదనంగా వచ్చిపడేదేమీ లేదని ఉక్రెయిన్ అధ్య క్షుడు జెలెన్‌స్కీకి అర్థమై ఉండాలి. 'నాటో సభ్యత్వం వద్దు... కనీసం రెండు దశాబ్దాల పాటు మా భద్రతకు పూచీ పడతామని అమెరికా హామీ ఇస్తే రష్యాతో రాజీ పడతామని ఆయనన్నారు. కానీ వినేవారేరి? యూరప్‌దీ అదే స్థితి. గ్రీన్‌ల్యాండ్ విషయంలో రుబియోతో ప్రత్యేకంగా సమావేశమయ్యే అవకాశం వచ్చినా డెన్మార్క్, గ్రీన్‌ల్యాండ్ అధి నేతలకు ఎలాంటి హామీ దొరకలేదు. మొత్తానికి తమది ఇకపై ఒంటరి పయనమేనని తెలి సింది గనుక స్వీయ ప్రయో జనాలపై యూరప్ దృష్టి సారించాలి. అమెరికా కీలుబొమ్మగా వ్యవహరించటం విం మించుకోవాలి.

## రోడ్డు ప్రమాదంలో ముగ్గురు స్నేహితుల దుర్మరణం

**పాడేరు:** జాతరకు వెళ్లి తిరిగివస్తుండగా జరిగిన ప్రమాదం ముగ్గురు స్నేహితులను బలి తీసుకుంది. ఈ ఘటన వంతలగుమ్మి సమీపంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గెమ్మలి రమేశ్ (22), సిదరి శ్రీధర్ పౌలు (17), రేగం సూర్యప్రకాష్(21) ముగ్గురు స్నేహితులు. శివరాత్రి సందర్భంగా హుకుంపేట మండలంలో జరిగిన మత్స్యగుండం జాతరకు వెళ్లారు. అనంతరం తిరిగి తమ స్వగ్రామాలకు వస్తుండగా వంతలగుమ్మి సమీపంలోని మలుపు వద్ద వీరి ద్విచక్రవాహనం వేగంగా వస్తూ రెండు విద్యుత్ స్తంభాల మధ్యలోనుంచి వెళ్లి ఓ ఇంటి గోడను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురు యువకులు మృతి చెందారు. ఈ ప్రమాదంలో ఘటనా స్థలంలోనే ఇద్దరు చనిపోగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరొకరు మృతి చెందారు . ఈ ప్రమాదంపై పాడేరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## నకిలీ మద్యం కేసులో సుదర్శన్‌కు బెయిల్

**విజయవాడ:** నకిలీ మద్యం కేసులో నిందితుడు సుదర్శన్‌కు బెయిల్ మంజూరైంది. ఇబ్రహీంపట్నం, ములకలచెరువుల్లో నకిలీ మద్యం తయారు చేసినట్లు అతనిపై అభియోగాలు ఉన్నాయి. సుదర్శన్ నెల్లూరు జిల్లా జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. వాద, ప్రతివాదనలు ముగియడంతో విజయవాడ ఆరో అదనపు జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు బెయిల్ మంజూరు చేసింది.రూ.25 వేల చొప్పున రెండు పూచీకత్తు సమర్పించాలని ఆయనకు న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. అలాగే, నకిలీ మద్యం కేసులో మరో నిందితుడు సెంథిల్‌ను కస్టడీకి ఇవ్వాలని అధికారులు కోర్టుని కోరారు. తనకు బెయిల్ ఇవ్వాలని సెంథిల్ పిటిషన్‌లు దాఖలు చేశారు. ఇరువురు పిటిషన్లపై విచారణను కోర్టు ఈనెల 19వ తేదీకి వాయిదా వేసింది.

## మేకలపై చిరుత దాడి

**అనంతపురం:** గుడిబండ మండలంలోని చిగతుర్పి గ్రామంలో లింగప్పకు చెందిన రెండు మేకలు చిరుతదాడిలో మృతిచెందాయి. బాధితుడు లింగప్ప ఇంటివద్ద కట్టేసిన మేకలపై ఆదివారం రాత్రి చిరుత దాడి చేసి చంపింది. దీంతో రూ.20వేలు నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు. ఫారెస్ట్ అధికారులు గ్రామానికి చేరుకుని మేకల కళేబరాలను పరిశీలించారు. అనంతరం పశువైద్యాధికారులతో పోస్ట్‌మార్టం నిర్వహించారు. కార్యక్రమంలో ఫారెస్ట్ అధికారులు గ్రామస్థులు పాల్గొన్నారు.

## స్వల్పంగా తగ్గిన బంగారం ధరలు

**న్యూఢిల్లీ:** వివాహాది శుభకార్యాల సీజన్ మొదలైన వేళ బంగారం ధరలు స్వల్పంగా దిగొస్తున్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో చోటుచేసుకున్న పరిణామాల ప్రభావంతో తెలుగు రాష్ట్రాల్లో బంగారం, వెండి ధరలు వరుసగా రెండో రోజు కూడా తగ్గుముఖం పట్టాయి. మంగళవారం హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల మేలిమి బంగారం 10 గ్రాముల ధరపై ఏకంగా రూ.1,530 తగ్గి రూ.1,54,910 వద్ద కొనసాగుతోంది. గడచిన రెండు రోజుల్లో రూ.2,840 మేర ధర తగ్గడం విశేషం. ఇక అభరణాల తయారీలో వినియోగించే 22 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధరపై రూ.1,400 తగ్గి రూ.1,42,000కు చేరింది. బంగారంతో పాటే వెండి ధర కూడా భారీగా పతనమై కేజీ ధర రూ.2,65,000 వద్ద కొనసాగుతోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో స్పాట్ గోల్డ్ ధర ఔన్సుకు 5 వేల డాలర్ల మార్కు నుంచి 4,930 డాలర్ల స్థాయికి పడిపోవడంతో దేశీయంగా కూడా ధరలు దిగొచ్చాయి. దానికి తోడు డాలర్ విలువలో మార్పులు కూడా బులియన్ మార్కెట్‌పై ప్రభావం చూపాయి.

## హర్యానా నిట్‌లో తెలంగాణ విద్యార్థి మృతి

**న్యూఢిల్లీ:** హర్యానాలోని కురుక్షేత్రలో ఉన్న నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో తెలంగాణకు చెందిన ఓ విద్యార్థి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. మహేశ్వరం మండలం రంగారెడ్డి జిల్లాకు చెందిన అంగోత్ శివ (19) నిట్ కురుక్షేత్రలో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. సోమవారం మధ్యాహ్నం హాస్టల్ గదికి వెళ్లిన శివ.. భోజనానికి రాకపోవడంతో తోటి విద్యార్థులు గదికి వెళ్లి చూశారు. ఈ క్రమంలో, శివ.. సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఉన్నట్లు సమాచారం. కళాశాల యాజమాన్యం దీనిని ఆత్మహత్యగా అనుమానిస్తోంది. విద్యార్థి మృతదేహాన్ని నిట్ సివిల్ హాస్పిటల్‌కు తరలించారు. అయితే, శివ మృతిపై కుటుంబ సభ్యులు తీవ్ర అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. నిట్ కురుక్షేత్ర క్యాంపస్ ముందు కుటుంబ సభ్యులు పడిగాపులు కాస్తున్నారు. కనీసం ఆస్పత్రి లోపలికి కూడా సిబ్బంది అనుమతించని పరిస్థితి. తమ కుమారుడి మృతిపట్ల కాలేజీ యాజమాన్యం సరిగా స్పందించకపోవడంపై శివ తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థి మృతిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు

## అసెంబ్లీకి హాజరుకావడం ఎమ్మెల్యేల విధి

**అమరావతి:** ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు.. అసెంబ్లీ లాబీలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు చిట్‌చాట్ చేశారు. అయితే, విధులు సక్రమంగా నిర్వర్తించని ఎమ్మెల్యేలను ప్రజలు రీకాల్ చేయాలంటూ పిలుపునిచ్చారు.. అసెంబ్లీకి హాజరుకావడం ఎమ్మెల్యేల విధి అని స్పష్టం చేశారు స్పీకర్ అయ్యన్నపాత్రుడు.. కొందరు సభ్యులు సభకు హాజరుకాకుండానే జీతాభత్యాలు తీసుకుంటున్నారని.. సభకు హాజరుకాని సభ్యులకు జీతం కట్ చేయాలి కదా? అని ప్రశ్నించారు.. ఈ అంశాలన్నీ జాతీయ స్థాయిలో చర్చ చేపట్టామని? ఈ నిబంధన దాదాపు 8 దేశాల్లో అమల్లో ఉందన్నారు. ఇక, అసెంబ్లీలో నూతనంగా ప్రవేశపెట్టిన డిజిటల్ అటెండెన్స్ బాగా పని చేస్తోందన్నారు స్పీకర్ అయ్యన్నపాత్రుడు.. కాగా, తమకు ప్రధాన ప్రతిపక్ష హోదా ఇవ్వాలనే ప్రధాన డిమాండ్‌తో అసెంబ్లీ సమావేశాలకు హాజరుకావడం లేదు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ.. మొక్కుబడిగా.. అసెంబ్లీ ప్రారంభమైన తొలిరోజు హాజరై.

## మున్సిపల్ చైర్మన్ల ఎన్నికలో అక్రమాలు

**హైదరాబాద్:** మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ దౌర్జన్యాలపై మాజీ మంత్రులు శ్రీనివాస్ గౌడ్, కొప్పుల ఈశ్వర్, బీఆర్ఎస్ నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. మున్సిపల్ చైర్మన్ ఎన్నికల్లో కాంగ్రెస్ నేతలు, కౌన్సిలర్ల దౌర్జన్యం, ఇబ్రహీం పట్నం ఎన్నిక స్టే అంశం పై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..116 మున్సిపాలిటీ ,7 కార్పొరేషన్లలో ఎన్నికలు జరిగాయి. విచ్చలవిడిగా డబ్బు పంపిణీ చేసి, దాడులు చేశారని మండిపడ్డారు. ఎన్నికలు సజావుగా జరగలేదు. ఇవాళ చైర్మన్ ఎన్నికలో సైతం దాడులకు పాల్పడ్డారని ఆరోపించారు

## కెసిఆర్‌కు సిఎం రేవంత్ తదితరుల శుభాకాంక్షలు

**హైదరాబాద్:** ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పుట్టిన రోజు సందర్భంగా పలువురు ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు. కేసీఆర్ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు వర్ధిల్లాలని, పలు సోషల్ మీడియా ప్లాట్‌ఫాంల ద్వారా చేసిన ప్రకటనల్లో వారు ఆకాంక్షించారు. తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మంత్రులు, పలు రాజకీయ పార్టీల నేతలు, సినీ తారలు, పలు రంగాలకు చెందిన ప్రముఖులు కేసీఆర్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. కేసీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన వారిలో రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి, మల్లు భట్టి విక్రమార్క, ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఏపీ ప్రధాన ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, ఏపీ మంత్రి నారా లోకేష్, తెలంగాణ రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొండ సురేఖ, కేంద్ర మంత్రి బండి సంజయ్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్, విజయ సాయి రెడ్డి మెగాస్టార్ చిరంజీవి తదితరులు ఉన్నారు. కకాగా తనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ప్రముఖులకు కేసీఆర్ ధన్యవాదాలు తెలిపారు

## పెట్రోల్ పోసి మహిళ హత్యకు పన్నాగం

**మహబూబాబాద్:** వివాహితను ఓ ఉన్మాది హత్య చేసేందుకు యత్నించిన ఘటన మహబూబాబాద్ జిల్లాలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గూడూరు మండలానికి చెందిన ఓ మహిళ తన భర్తతో మనస్పర్థల కారణంగా వేరుగా ఉంటుంది. ఇద్దరు పిల్లలను వసతిగృహంలో చదివిస్తూ స్థానికంగా కూరగాయల దుకాణం నడిపిస్తూ జీవిస్తోంది. ఈ క్రమంలో అంజయ్య అనే వ్యక్తి.. సదురు మహిళతో సాన్నిహిత్యం పెంచుకున్నాడు. తనను వివాహం చేసుకోవాలని ఆమెను వేధించడం మొదలుపెట్టాడు. దీంతో ఆమె తనకు ఇది వరకే వివాహమైందని.. భర్త, పిల్లలు ఉన్నారని చెప్పి హైదరాబాద్‌కు మకాం మార్చింది. ఇటీవల ఆ మహిళ మహబూబాబాద్‌లో ఉంటున్న తన తల్లి ఇంటికి వచ్చి ఉంటుంది. సమాచారం తెలుసుకున్న అంజయ్య అక్కడికి వచ్చి తనను నిరాకరించిందన్న కోపంతో ఆమెపై పెట్రోల్ పోసి నిప్పంటించాడు. ఈ క్రమంలో అంజయ్యకు మంటలు అంటుకున్నాయి. ఇద్దరికీ తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు మొదట పట్టణ ప్రభుత్వ ఆస్పత్రికి, అనంతరం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. మహిళ తల్లి ఫిర్యాదు మేరకు అంజయ్యపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

## 20న గచ్చిబౌలి స్టేడియంలో సీఎం కప్-2026

**హైదరాబాద్:** ఫిబ్రవరి 20న గచ్చిబౌలి స్టేడియంలో ప్రారంభంకానున్న సీఎం కప్–2026 కార్యక్రమానికి హాజరుకావాలని రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు అనుముల రేవంత్ రెడ్డిని రాష్ట్ర పశుసంవర్ధక, పాడిపారిశ్రామికాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివాసేనరెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ ఓఆ సోనిబాలాదేవి లు ఆహ్వానించారు. పల్లె నుంచి పట్నం వరకు విద్యార్థులు, యువతీ,యువకుల్లో దాగి క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సీఎం కప్‌ను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందని మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. మొత్తం 44 రకాల క్రీడలను సీఎం కప్‌లో భాగంగా పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. కీడలల్లో పాల్గొనడం వల్ల పోటీతత్వంతో శారీరక ధృఢత్వం మెరుగుపడుతుందని మంత్రి వాకిటి శ్రీహరి అభిప్రాయపడ్డారు. సీఎం కప్‌ను పాఠశాల విద్యనుంచి యూనివర్శిటీ స్థాయి విద్యార్థుల వరకు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి వాకిటి శ్రీహరి కోరారు.

## జెఇఇ మెయిన్ పరీక్షలో మెరిసిన బీసీ విద్యార్థులు

**హైదరాబాద్:** దేశవ్యాప్తంగా మొదటి విడతలో జరిగిన జెఈఈ మెయిన్ ప్రవేశ పరీక్షలో బీసీ గురుకుల ఇంటర్ విద్యార్థులు 318 మంది విద్యార్థులు హాజరు కాగా వారిలో ఐదుగురు విద్యార్థులు 90 కంటే ఎక్కువ పర్సంటైల్ సాధించారు. మరో 28మంది విద్యార్థులు 80 కంటే ఎక్కువ పర్సంటైల్ సాధించారు. బాలికల విభాగంలో ఏ. నిత్య (92.19) , సిహెచ్ గాయత్రి ( 91.50), ఎం. సహస్ర ( 87.69), పి. చరిత(86.20), ఎం. స్నేహ(85.09) పర్సంటైల్ సాధించారు. బాలుర విభాగంలో ఎం. నరేందర్(91.58), ఆర్ . కౌశిక్ (91.25), బి.మల్లేష్( 90.50), బి.హరీష్ (89.19), డి.రోహన్(88.05) పర్సంటైల్ సాధించారు. గతంలో రెండు సీఓఈ లలో విద్యార్థులకు పోటీ పరీక్షలకు కోచింగ్ ఇస్తుండగా తమ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా పది సీఓఈ లను ఏర్పాటు చేయడమే కాకుండా లాంగ్ టర్మ్ కోచింగ్ కూడా ఇస్తున్నదని ఈ అవకాశాన్ని వినియోగించుకుని విద్యార్థులు అధిక సంఖ్యలో పోటీ పరీక్షలు రాసి మంచి ఫలితాలు సాధించారని, రానున్న రోజుల్లో మరింత మెరుగైన ఫలితాలు సాధించాలని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గారు ఆకాంక్షించారు. అత్యుత్తమ ప్రతిభను చూపిన విద్యార్థినీ, విద్యార్థులను, బోధనా సిబ్బందిని మంత్రి , బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి ఈ. శ్రీధర్ , ఐఎఎస్, ఎంజెపి సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు ఐఎఫ్ఎస్ అభినందించారు.

# కృత్రిమ మేధ కళ్లద్దాలు

### ఏఐ అద్దాలతో దర్శనమిచ్చిన ప్రధాని మోడీ

**ముంబై:** భారత్ ఆతిథ్యమిస్తున్న ఇండియా ఏఐ ఇంపాక్ట్ ఎక్స్‌పో–2026, సమిట్ ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఈ సదస్సు జరుగుతోన్న వేళ మన స్టార్టప్ 'సర్వం ఏఐ' చేసిన ప్రకటన వార్తల్లో నిలిచింది. త్వరలో ఏఐ స్మార్ట్ గ్లాసెస్ తీసుకువస్తామని వెల్లడించింది. ఆ అద్దాలు ధరించిన ప్రధాని మోదీ ఫొటో ఇప్పుడు నెట్టింట్లో వైరల్‌గా మారింది. కాగా...కృత్రిమ మేధ రంగంపై విస్తృతంగా చర్చించేందుకు, అత్యాధునిక ఆవిష్కరణలపై అవగాహన కల్పించే లక్ష్యంతో భారత్‌లో ఏఐ సమిట్ జరుగుతోంది. ఏఐ ప్రయాణంలో భారత్ ముందు వరుసలో నిలిచిందని, దాని పురోగతి.. లక్ష్యం, బాధ్యతలను ప్రతిబింబిస్తుందని ఇప్పటికే మోదీ పేర్కొన్న సంగతి తెలిసిందే. బెంగళూరు కేంద్రంగా 2023లో వివేక్ రాఘవన్, ప్రత్యూష్ కుమార్ ఈ సర్వం ఏఐని స్థాపించారు. గ్లాసెస్ గురించి ప్రత్యూష్ ఒక వీడియోను షేర్ చేశారు. ఆ గ్లాసెస్‌కు 'సర్వం కేజ్' అని పేరుపెట్టారు. ఆ తర్వాత మోదీ ఆ అద్దాలను ధరించిన ఫొటోను షేర్ చేశారు. 'వాటిని ధరించిన మొదటి వ్యక్తి ఎవరో తెలుసా..? ప్రధానమంత్రి' అని ప్రత్యూష్ తన పోస్టులో రాసుకొచ్చారు. అది ఏఐ ఇంపాక్ట్ సమిట్‌లో దిగిన చిత్రంగా తెలుస్తోంది. సర్వం కేజ్ కళ్లద్దాలను భారత్‌లోనే అభివృద్ధి చేశామని కుమార్ వెల్లడించారు. ఇది తొలి స్వదేశీ ఏఐ హార్డ్‌వేర్ అని పేర్కొన్నారు. 'ఇది యూజర్ రియల్ వరల్డ్‌లో చూసేవాటిని గమనిస్తుంది.. అర్థం చేసుకుంటుంది.. ప్రతిస్పందిస్తుంది.. క్యాప్చర్ చేస్తుంది' అని వాటి పనితీరు గురించి వివరించారు. త్వరలో వాటికి చాట్ ఫీచర్‌ను కూడా తీసువస్తామని చెప్పారు. ఏఐ గ్లాసెస్‌ను తమ అవసరాలకు అనుగుణంగా కస్టమైజ్ చేసుకోవచ్చు. మేలో ఈ ప్రొడక్ట్ మార్కెట్‌లోకి రానుంది.ప్రపంచవ్యాప్తంగా ఈ స్మార్ట్ గ్లాసెస్ పై ఆసక్తి పెరుగుతోంది. మెటా ఇప్పటికే 'రేబ్యాన్ మెటా' పేరిట గ్లాసెస్‌ను లాంచ్ చేసింది. 2025లో 7మిలియన్ల గ్లాసెస్‌ను విక్రయించింది. త్వరలో యాపిల్ సంస్థ కూడా ఈ తరహా గ్లాసెస్‌ను తీసుకురానుంది. భారత వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా ఏఐ నమూనాలపై పనిచేస్తోన్న సంస్థల్లో సర్వం కూడా ఒకటి. ఈ సంస్థ ఇప్పటికే సర్వం అక్షర్ , సర్వం స్టూడియో సారస్ వీ3 ని తీసుకువచ్చింది.

# లాటరీలో తొర్రూరును కొట్టేసిన కాంగ్రెస్

### 7 సీట్లు మాత్రమే గెలిచినా వరించిన విజయం

### చైర్మన్‌గా శ్రవణ్ కుమార్ ఎన్నిక

### తొర్రూరు చేజారడంతో ఎర్రబల్లి కన్నీరు

**మహబూబాబాద్:** ఉత్కంఠకు తెరదించుతూ తొర్రూరు మున్సిపాలిటీని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది. మున్సిపల్ చైర్మన్ పదవి కోసం జరిగిన హోరాహోరీ పోరులో చివరకు అదృష్టం కాంగ్రెస్ అభ్యర్థిని వరించింది. చైర్మన్ ఎన్నిక ప్రక్రియలో ఇరు వర్గాల బలాబలాలు సమానంగా ఉండటంతో అధికారులు 'లక్కీ డ్రా' పద్ధతిని అనుసరించారు. ఈ డ్రాలో కాంగ్రెస్ అభ్యర్థి, రెండో వార్డు సభ్యుడు శ్రవణ్ కుమార్ విజేతగా నిలిచారు. దీంతో ఎన్నికల అధికారి ఆయన పేరును అధికారికంగా ప్రకటించి పత్రాన్ని అందజేశారు. మున్సిపాలిటీని దక్కించుకోవడంతో కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు జరుపుకుంటుండగా, బీఆర్ఎస్ క్యాంప్‌లో విషాదం నెలకొంది. తొర్రూర్‌లో మొత్తం 16 వార్డుల్లో బీఆర్ఎస్ 9, కాంగ్రెస్ 7 గెలుచుకోగా.. ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, ఎంపీ కడియం కావ్యల ఎక్స్‌అఫీషియో ఓట్లతో కాంగ్రెస్ సంఖ్య 9కి పెరిగింది. రెండు పార్టీల బలాలు సమానం కావడంతో అధికారులు లాటరీ ద్వారా చైర్మన్‌ను నిర్ణయించారు. దీంతో కాంగ్రెస్ అభ్యర్థి శ్రావణ్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. ఎంపీ కడియం కావ్య ఎక్స్‌అఫీషియో ఓటు చెల్లదంటూ బీఆర్ఎస్ శ్రేణులతో ఆందోళనకు దిగిన దయాకర్‌రావును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఆయన్ను నర్సింహులుపేట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ నేపథ్యంలో ఎర్రబెల్లి మీడియాతో మాట్లాడుతూ భావోద్వేగానికి గురయ్యారు.అయితే, తన రాజకీయ కంచుకోటగా భావించే తొర్రూరు మున్సిపాలిటీ చేజారిపోవడంతో బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు తీవ్ర భావోద్వేగానికి లోనై మీడియా ముందే కన్నీళ్లు పెట్టుకున్నారు. తొర్రూరులో బీఆర్ఎస్ ఓటమిని జీర్ణించుకోలేకపోయిన ఎర్రబెల్లి దయాకర్ రావు కార్యకర్తల కష్టాన్ని తలుచుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు. ప్రాణాలకు తెగించి కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు నేను ఇప్పుడు ఏం సమాధానం చెప్పాలని అంటూ ఆయన కంటతడి పెట్టారు. నాయకులు కేసీఆర్ అంటే ప్రజల్లో ఎంత అభిమానం ఉన్నా, అధికార పార్టీ సాగిస్తున్న అరాచకాలు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పోలీసుల వ్యవహారశైలిని ఎర్రబెల్లి తీవ్రంగా తప్పుబట్టారు. పోలీసులు కూడా అధికార పార్టీకి తొత్తులుగా మారి పనిచేయడం మంచి పద్ధతి కాదని హితవు పలికారు. ప్రస్తుతం జరుగుతున్న అరాచకాలను ప్రజలు గమనిస్తున్నారని, త్వరలోనే దీనికి ముగింపు పడుతుందని ఆయన హెచ్చరించారు. బీఆర్ఎస్ శ్రేణులు ఈ సందర్భంగా 'జై తెలంగాణ' అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు.

# రచయిత సలీం ఖాన్ ఆస్పత్రిలో చేరిక

**ముంబై:** బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్ తండ్రి, ప్రముఖ రచయితసలీం ఖాన్ ముంబైలోని లీలావతి ఆసుపత్రిలో చేరారు. ఈ వార్త తెలియగానే అభిమానులు ఆయన ఆరోగ్యం గురించి ఆందోళన చెందారు, ఆయన త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నారు. సల్మాన్ ఖాన్ కుటుంబం ఇంకా సలీం ఖాన్ గురించి ఎలాంటి అధికారిక ప్రకటన విడుదల చేయలేదు.సలీం ఖాన్ ఆసుపత్రిలో చేరినట్లు తెలియగానే ఖాన్ కుటుంబం మొత్తం ఆందోళన చెందుతోంది. తన తండ్రి ఆరోగ్యం గురించి తెలిసిన వెంటనే బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్ ఖాన్ లీలావతి ఆసుపత్రికి చేరుకున్నారు. ఆయన ఆసుపత్రికి వెళ్లిన వీడియోలు, ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ ఫోటోలలో ఆయన ఫేస్‌లో బాధ, ఆందోళన స్పష్టంగా కనిపించాయి. అలాగే అల్విరా ఖాన్ కూడా తన తండ్రిని కలవడానికి ఆస్పత్రికి వెళ్లారు. అర్పిత, ఆమె భర్త ఆయుష్ శర్మ కూడా ఆసుపత్రికి చేరుకున్న ఫోటోలు కనిపించాయి. అయితే, సలీం ఖాన్ సాధారణ చెకప్ కోసం ఆసుపత్రికి వెళ్లారా లేదా ఏదైనా తీవ్రమైన సమస్య ఉందా అనే విషయాన్ని ఇప్పటి వరకు ఖాన్ కుటుంబం వెల్లడించలేదు.సలీం ఖాన్ గురించి చెప్పాలంటే.. ఆయన బాలీవుడ్ పరిశ్రమలో దిగ్గజ రచయితల్లో ఒకరు. ఆయన తన సినీ కెరీర్‌ను నటుడిగా ప్రారంభించినా, తర్వాత తర్వాత గొప్ప రైటర్‌గా ఎదిగారు. ఆయన, జావేద్ అక్తర్‌తో కలిసి జంజీర్, షోలే, డాన్, షాన్, యాదోం కి బారాత్ వంటి అనేక ఐకానిక్ బాలీవుడ్ చిత్రాల కథలను రాశారు. సలీం ఖాన్ వయసు 90 సంవత్సరాలు. ఆయన ఇండోర్‌లో 1935 నవంబర్‌లో జన్మించారు. 1964లో, సలీం ఖాన్ సుశీలా చరక్‌ను (సల్మా ఖాన్) వివాహం చేసుకున్నారు. వీరికి నలుగురు పిల్లలు ఉన్నారు. ముగ్గురు కుమారులు (సల్మాన్ ఖాన్, అర్బాజ్ ఖాన్, సోహైల్ ఖాన్, ఒక కుమార్తె అల్విరా ఖాన్). అలాగే సలీం ఖాన్ అర్పిత అనే కుమార్తెను దత్తత తీసుకున్నారు. అలాగే ఆయన నటి హెలెన్‌ను కూడా వివాహం చేసుకున్నారు. ప్రస్తుతం ఆయన తన కుటుంబంతో సంతోషకరమైన జీవితాన్ని గడుపుతున్నారు. ఈక్రమంలో ఆయన ఆస్పత్రిలో చేరినట్లు వార్తలు రావడంతో అభిమానులు ఆందోళన చెందుతున్నారు.

## ధవలేశరం కొత్త గేట్లకు 150 కోట్లు విడుదల

**అమరావతి:** ధవళేశ్వరం సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజ్ గేట్ల దుస్థితిపై ఏపీ అసెంబ్లీ సమావేశాల్లో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు కీలక ప్రకటన చేశారు. నాడు బ్యారేజ్‌కు నిధులు ఇచ్చిన చంద్రబాబే.. మళ్లీ నేడు ధవలేశ్వరం బ్యారేజ్ కొత్త గేట్ల ఏర్పాటుకు రూ.150 కోట్ల నిధులను మంజూరు చేసినట్లు తెలిపారు. ఇందులో భాగంగా పాడైపోయిన గేట్లను తొలగించి కొత్త గేట్లను అమర్చ నున్నట్టు వెల్లడించారు. బ్యారేజ్‌లోని 117 గేట్లను తొలగించి వాటి స్థానంలో అధునాతనమైన కొత్త గేట్లను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ పనుల ద్వారా గోదావరి జలాలు సమర్థవంతంగా నిల్వ ఉండి, డెల్టా ప్రాంత

# ఆ పాట గురించి అక్కడున్న వారికి తెలియదు: నిర్మాతలు క్లారిటీ



నటుడు చంద్రహాస్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన చిత్రం 'బరాబర్ ప్రేమిస్తా'. ఇటీవల జరిగిన దీని ప్రీరిలీజ్ ఈవెంట్‌లో చంద్రహాస్ పాడిన పాట వివాదాలకు కారణమైంది. అందులో అసభ్య పదాలు ఉండడంతో తీవ్ర విమర్శలు వస్తున్నాయి. తాజాగా చిత్ర దర్శకనిర్మాతలు ఈ అంశంపై వివరణ ఇచ్చారు. వేదికపై అలాంటి పాట పాడడంపై విచారం వ్యక్తం చేశారు.
నిర్మాత చిన్ని మాట్లాడుతూ.. "సినిమాలో తన పాత్ర గురించి చెప్పే ఉద్దేశంతో చంద్రహాస్ పాట పాడాడు. దాంట్లో చిన్న పొరపాటు జరిగింది. దాని గురించి ఆ ఈవెంట్‌లో ఉన్న ఎవరికీ తెలియదు. అతడు కావాలని చేయలేదు. దానికి మేం బాధ పడుతున్నాం. ఆ పాట పాడి కిందకు వచ్చిన తర్వాత అలా చేయకూడదని తనకు కూడా చెప్పాం" అని అన్నారు. దర్శకుడు సంపత్ రుద్ర కూడా దీని గురించి మాట్లాడారు. చంద్రహాస్ అలా చేసినందుకు చాలా బాధగా ఉందన్నారు. సినిమాలో అలాంటి పాటలు లేవని స్పష్టంచేశారు. ఫిబ్రవరి 6న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది.
మరోవైపు చంద్రహాస్ ఆ పాట పాడే సమయంలో నటుడు జేడీ చక్రవర్తి అక్కడే ఉన్నా కూడా ఆయన దాన్ని ఆపే ప్రయత్నం చేయలేదని ట్రోల్స్ మొదలయ్యాయి. దీనిపై ఆయన స్పందించారు. ఆ రోజు తాను ఆ ఈవెంట్ నుంచి వెళ్లిపోవాల్సిందని అభిప్రాయపడ్డారు. సినిమా ప్రమోషన్లు విభిన్నంగా చేయడం తప్పు కాదని.. కానీ, అవి మహిళలను కించపరిచేలా, అసభ్యంగా ఉండకూడదన్నారు. ఈ మేరకు ఆయన ఓ వీడియో విడుదల చేశారు.

# 'వారణాసి'... ఒక భాగంగానే!



అగ్ర దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి దర్శకత్వంలో మహేశ్‌బాబు కథానాయకుడిగా తెరకెక్కుతున్న 'వారణాసి' ఒకే భాగం సినిమాగానే ప్రేక్షకుల ముందుకు రానుంది. ఆ విషయాన్ని హాలీవుడ్ మీడియాకి ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో బయట పెట్టారు దర్శకుడు. తాను తీస్తున్న సినిమాలకి సంబంధించిన కథ, నేపథ్యం మొదలుకొని, చాలా విషయాల్ని బయట పెడుతుంటారు రాజమౌళి. 'వారణాసి' విషయంలో అందుకు భిన్నంగా సినిమాకి సంబంధించిన ఏ విషయం బయటకు రాకుండా జాగ్రత్తలు తీసుకొన్నారు. ప్రచార చిత్రం విడుదల సందర్భంగా నిర్వహించిన వేడుకలో ఇది రామాయణం ఆధారంగా రూపొందుతున్న చిత్రమని మాత్రమే చెప్పారు.
రెండు భాగాలుగా వస్తుందంటూ సాగిన ప్రచారానికి తెరదించుతూ... మొదట రెండు భాగాలు అనుకున్నాం కానీ, ఆ వెంటనే ఆ ఆలోచనని పక్కన పెట్టేశామని, మూడు గంటల కుపైగా నిడివితో ఈ సినిమాని ఒకే భాగంగానే ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్టు స్పష్టత నిచ్చారు రాజమౌళి. మహేశ్‌బాబుతో సినిమా పదిహేనేళ్ల కిందటే తీయాలనుకున్నానని, కానీ తనకున్న ఒప్పందాల కారణంగా ఇప్పటికి కుదిరిందని తెలిపారు. ఈ సినిమాలో రామాయణంలోని ఓ భాగాన్ని చూపించనున్నట్టు తెలిపారు రాజమౌళి. 25 నిమిషాలపాటు సాగే రామాయణ కాలంనాటి ఆ సన్నివేశాలు ఎప్పటికీ మరిచిపోలేని విధంగా ఉంటాయని కీలక విషయాన్ని చెప్పారు. మహేశ్‌బాబు, ప్రియాంక చోప్రా జంటగా నటించిన ఈ చిత్రం వచ్చే ఏడాది ఏప్రిల్ 7న విడుదల కానుంది.

# మహిషాపురం దేవత 'మారెమ్మ'



బలమైన కథ ఇందులో ఉండటంతో... 'మారెమ్మ' సినిమాతోనే తాను పరిచయం కావాలని నిర్ణయించుకున్నట్టు తెలిపారు మాధవ్. ప్రముఖ కథానాయకుడు రవితేజ సోదరుడు, నటుడు రఘు కుమారుడే మాధవ్. ఆయన కథానాయకుడిగా, మంచాల నాగరాజు దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రమిది. దీపా బాలు కథానాయిక. మయూర్ రెడ్డి బండారు నిర్మిస్తున్నారు. ఈ సినిమా టీజర్ ఆవిష్కరణ కార్యక్రమం బుధవారం హైదరాబాద్‌లో జరిగింది. ప్రముఖ దర్శకుడు బాబీ కొల్లి ముఖ్య అతిథిగా హాజరై టీజర్‌ని విడుదల చేశారు. మహిషాపురం అనే ఊరు, ఆ గ్రామ దేవతైన మారెమ్మ చుట్టూ తిరిగే కథతో ఈ చిత్రం రూపొందింది.

# గద్దర్ పురస్కారాలకు జ్యూరీ కమిటీల ఎంపిక



తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్ – 2025 ఎంపిక కోసం నాలుగు జ్యూరీ కమిటీల్ని నియమించింది రాష్ట్ర ప్రభుత్వం. సామాజిక సందేశంతో కూడిన చలన చిత్రాలతోపాటు, కొత్తగా ప్రవేశపెట్టిన పలు కేటగిరీల్లో పురస్కారాల ఎంపిక కోసం ప్రముఖ సంగీత దర్శకుడు మణిశర్మ ఛైర్మన్‌గా 14 మంది సభ్యులతో ఓ జ్యూరీ ఏర్పాటైంది. డా.సి.నారాయణరెడ్డి, అక్కినేని నాగేశ్వరరావు సినీ పురస్కారాలతోపాటు ఇతర ప్రముఖుల పేర్లతో ప్రదానం చేయనున్న పురస్కారాల ఎంపిక కోసం సీనియర్ దర్శకుడు కె.రాఘవేంద్రరరావు ఛైర్మన్‌గా నలుగురు సభ్యులతో జ్యూరీ ఏర్పాటైంది. డాక్యుమెంటరీ, లఘు చిత్రాల విభాగానికి సంబంధించి కనకమేడల విజయ్‌కృష్ణ ఛైర్మన్‌గా, ఆరుగురు సభ్యులతో మరొక జ్యూరీ, సినిమాపై ఉత్తమ పుస్తకాలు, ఉత్తమ సినీ విమర్శ విభాగం కోసం ప్రముఖ నటుడు తనికెళ్ల భరణి ఛైర్మన్‌గా నలుగురు సభ్యులతో జ్యూరీ ఏర్పాటైంది. ప్రతి జ్యూరీ కమిటీకీ తెలంగాణ రాష్ట్ర ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ సభ్యుడిగా, కన్వీనర్‌గా వ్యవహరించనున్నారు.

# ధనుష్ చిత్రంలో మమ్ముట్టి



మాతృక మలయాళంలోనే కాదు.. భాషతో సంబంధం లేకుండా కథల్ని ఎంచుకుంటూ ప్రేక్షకుల్ని అలరిస్తుంటారు అగ్రహీరో మమ్ముట్టి. ఇప్పటికే పలు హిట్ చిత్రాలతో తమిళంలో సందడి చేసిన ఆయన.. ఇప్పుడు మరో తమిళ చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ధనుష్, దర్శకుడు రాజ్‌కుమార్ పెరియసామి కలయికలో తెరకెక్కుతున్న చిత్రం 'డీ 55' (వర్కింగ్ టైటిల్). ఇటీవలే ఇందులోకి కథానాయికలుగా సాయిపల్లవి, శ్రీలీలకు స్వాగతం పలికింది చిత్రబృందం. ఇప్పుడీ చిత్రంలో మమ్ముట్టి ఓ కీలక పాత్ర పోషిస్తున్నట్లు బుధవారం ఎక్స్ వేదికగా ప్రకటించింది. "ఆయన ఒక కథను ఎంచుకుంటే.. అది చరిత్రగా మారుతుంది. 'డీ 55' ప్రపంచంలోకి మమ్ముట్టికి వెల్‌కమ్ చెప్పడానికి మేము చాలా ఉత్సాహంగా ఉన్నాము"ని వ్యాఖ్యల్ని జోడించింది. 2019లో 'పెరంబు' అనే తమిళ చిత్రంతో మెప్పించిన మమ్ముట్టి మళ్లీ ఏడేళ్ల తర్వాత ఈ పరిశ్రమలోకి అడుగుపెట్టడం విశేషం. త్వరలో చిత్రీకరణను ప్రారంభించనున్నట్లు చిత్రవర్గాలు తెలిపాయి.



# అలియా @ 'హౌస్‌వైఫ్'?

యాక్షన్, ప్రేమకథలతో వినోదాలు పంచడమే కాదు.. జీవితానికి దగ్గరగా ఉండే కథల్ని తెరపై ఆవిష్కరించి ప్రేక్షకులకు కనువిప్పు కలిగించే సినిమాలూ ఉంటాయి. ఇప్పుడలాంటి చిత్రంతో ఏడడుగుల బంధం గురించి తెలియజేయడానికి గృహిణిగా మన ముందుకు రాబోతుందట బాలీవుడ్ నాయిక అలియా భట్. ఆమె.. హిందీలో 'దృశ్యం 2'ని తెరకెక్కించిన అభిషేక్ పాఠక్ రూపొందిస్తోన్న 'హౌస్‌వైఫ్' అనే చిత్రంలో ప్రధాన పాత్రలో నటిస్తున్నట్లు తెలుస్తోంది. వివాహమైన ఓ జంట చుట్టూ ఈ సినిమా ఉంటుందని సమాచారం. "ప్రస్తుతం అభిషేక్ పాఠక్ 'దృశ్యం 3' సినిమా చిత్రీకరణతో బిజీగా ఉన్నారు. అది పూర్తయిన తర్వాత ఆగస్టులో 'హౌస్‌వైఫ్'ను పట్టాలెక్కించాలని నిర్ణయం తీసుకున్నారు. ఇందులో అలియా కథానాయికగా నటించడమే కాకుండా ఈ చిత్రానికి సహ నిర్మాతగా వ్యవహరించనుంది. ఈ రిలేషన్‌షిప్ డ్రామాలో మరో కీలక పాత్ర కోసం రాజ్‌కుమార్ రావ్‌తో చర్చలు చేస్తోంది చిత్రబృందం. త్వరలో ఈ ప్రాజెక్టు గురించి అధికారికంగా వెల్లడించనున్నార"ని అలియా సన్నిహిత వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం ఆమె ఖాతాలో 'లవ్ అండ్ వార్', 'ఆల్ఫా' చిత్రాలున్నాయి.

PUBLISHED BY **G.KALPANA** AND **PRINTED AT YAGNA PRINTERS AND PUBLICATIONS**, H.NO 18-105/4, OPP HANUMANPET, MALKAJGIRI(M)MEDCHAL- 500047, MEDCHAL MALKAJGIRI DISTRICT,TELANGANA PUBLISHED FROM H.NO02-66/254, MALLAREDDY NAGAR PHASE 1, GAJULARAMARAM, QUTHBULLAPUR, MEDCHAL-500055, DISTRICT MALKAJGIRI, TELANGANA, EDITOR : **G.DAYAKAR REDDY**, **RNI :TELTEL/2022/83927,** PHONE NUMBER 9908293393,040- 45046154